

- మూడు జిల్లాలు, ఏజెన్సీ రాకపోకలకూ అనుకూలం
- ప్రజాప్రతినిధులకూ సౌలభ్యం
- పిల్లలకు దగ్గరలోనే ఐటీ ఉద్యోగాలు
- వైసీపీ హయాంలో ధ్వంసం
- కూటమి రాకతో పునరుజ్జీవం
- నూతనోత్తేజంతో రాజధాని పనులు పునః నిర్మాణం
- ఉమ్మడి తూర్పుగోదావరి నుంచి భారీగా తరలివెళ్లిన జనం

ప్రధానితో..



అమరావతి సభకు వస్తున్న మోదీకి స్వాగతం పలుకుతున్న మంత్రి సుభాష్, ఎంపీ ఉదయ్ శ్రీనివాస్, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు







గోదావరి టు అమరావతి!

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

విజన్ ఉన్న నాయకుడి అభివృద్ధి.. విధ్వంస నాయకుడి ధ్వంసం మధ్య వ్యత్యాసాన్ని రాష్ట్ర ప్రజలు గత ఐదేళ్లలో ప్రత్యక్షంగా అనుభవించారు. రాష్ట్ర విభజన తర్వాత ఏపీ ప్రజలకు రాజధాని లేకుండాపోయింది. సంక్షోభాల నుంచే అవకాశాలను సృష్టించుకోవాలని పదేపదే చెప్పడమే కాకుండా ఆచరణలో కూడా చేసి చూపించే సీఎం చంద్రబాబు.. రాజధానిని చరిత్రలో నిలిచిపోయే విధంగా నిర్మించాలని సంకల్పించారు. అన్ని పార్టీల అంగీకారంతో గుంటూరు- విజయవాడ ప్రాంతంలో నిర్మించాలనుకున్న రాజధానికి 'అమరావతి' అని నామకరణం చేశారు. 2017 మార్చి 2న శాసనసభను ప్రారంభించడంతో పాలన కూడా మొదలైంది. తర్వాత 2019లో ఎన్నికలు వచ్చిన విషయం తెలిసిందే. అప్పుడు కూడా టీడీపీ అధికారం కొనసాగేవిధంగా ప్రజలు దీవించి ఉంటే ఈనాటికి అద్భుతమైన రాజధాని అమరావతి ఆవిష్కృతమయ్యేది. కానీ పనులు ముమ్మరంగా జరుగుతున్న సమయంలో సార్వత్రిక ఎన్నికలు రావడం.. ప్రజలు జగన్‌కి పట్టంగట్టడంతో రాజకీయ కక్షను రాష్ట్ర ప్రయోజనాలకు ముడిపెట్టి అమరావతిని ధ్వంసం చేశారు. అప్పటివరకూ జరిగిన అమరావతి నిర్మాణాలను నిర్వీర్యం చేశారు. మూడు రాజధానులంటూ ఐదేళ్లు మూడు ముక్కలాటగా నడిచింది. అయితే 2024లో మళ్లీ టీడీపీ, బీజేపీ, జనసేన కలయికతో ఏర్పడిన కూటమి అధికారంలోకి రావడం, చంద్రబాబు సీఎం పగ్గాలు చేపట్టడంతో అమరావతికి మంచి రోజులు వచ్చాయి. ప్రధాని మోదీతో రాజధాని పనులకు శుక్రవారం పునఃప్రారంభం చేయించారు. ఇక ఉమ్మడి తూర్పుగోదావరి వాసులకు అమరావతి అందిపుచ్చుకున్నట్టు ఉంటుంది. ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్ వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు అమరావతి రాజధానికి వెళ్లాలంటే సగానికి సగం వ్యయ ప్రయాసలు తగ్గినట్టే.

● అందిపుచ్చుకున్నట్టేగా..

కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాలతోపాటు రంపచోడవరం ఏజెన్సీవాసులకు కూడా అమరావతి అందిపుచ్చుకున్నట్టు ఉంటుంది. వివిధ పనులపై రాజధానికి వెళ్లడానికి ప్రజలకు ఇబ్బంది తప్పుతుంది. హైదరాబాద్‌తో పోలిస్తే అమరావతి ఉమ్మడి తూర్పు వాళ్లకు దగ్గరే కాకుండా రవాణా సదుపాయమూ సౌలభ్యంగా ఉంటుంది. రైలు, బస్సుల్లో మూడు గంటల్లో, విమానంలో 45 నిమిషాల్లో అమరావతికి చేరుకోవచ్చు. కోర్టు, వైద్య పనులపై వెళ్లేవారికి ఇంకా సదుపాయంగా ఉంటుంది. రాత్రి వేళల్లో బస చేసే అవసరం ఉండదు. ఉదయం బయలుదేరితే పనులు చక్కబెట్టుకొని రాత్రి వేళకు ఇంటికి చేరుకోవచ్చు. గోదారోళ్ల రైలు ప్రయాణాలకు రాజమండ్రిని గేట్‌వేలాంటిది. ఈ రైల్వే స్టేషను గుండా విజయవాడ వెళ్లడానికి రోజూ 50కిపైగా రైళ్లు నడుస్తుంటాయి. అరగంటకో బస్సు అందుబాటులో ఉంటుంది. కాకినాడ జిల్లా వాళ్లకూ విజయవాడకు రవాణా సదుపాయాలు బాగానే ఉన్నాయి. కోనసీమ జిల్లావాసులకు రావులపాలెం నుంచి కూడా ప్రయాణ సదుపాయం మరింతగా కలుస్తుంది. అమలాపురం నుంచి మచిలీపట్నం హైవే గుండా కూడా విజయవాడకు సుమారు నాలుగు గంటల్లోపే చేరుకోవచ్చు.



అమరావతిలో ప్రధాని సభా ప్రాంగణంలో ఎంపీ హరీష్‌మాధుర్ , ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

● వైసీపీ హయాంలో ధ్వంస రచన

2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో అమరావతికి ధ్వంసరచన మొదలైంది. తాత్కాలిక హైకోర్టు మినహా పరిపాలన వంటి తాత్కాలిక భవనాలు తుది దశలో ఉండగా, రహదారులు వేగంగా నిర్మాణం జరుగుతూ.. ఐటీ కంపెనీలు కుదురుకునే దశలో సీఎంగా పగ్గాలు చేపట్టిన జగన్ అమరావతిని నట్టేట ముంచేశారు. జీఎన్‌ఆర్ కమిటీ సిఫారసులంటూ రాజధాని వికేంద్రీకరణను తెరపైకి తీసుకొచ్చారు. ఐదేళ్లపాటు మూడు ముక్కలాటను రాష్ట్ర ప్రజలకు చూపించారు. మూడు రాజధానులు కార్యరూపం దాలిస్తే ఉమ్మడి తూర్పు ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొనేవారే. ఉదాహరణకు రాజమండ్రి నుంచి కర్నూలు 500 కిలోమీటర్లు, విశాఖపట్నం 200 కిలోమీటర్లు, విజయవాడ 200కిలోమీటర్ల దూరంలో త్రికోణాకారంలో ఉన్నాయి. విజయవాడకు ఉన్న సదుపాయాలు వేటికీ లేవు. దీంతో అష్టకష్టాలు పడాల్సి వచ్చేది.

● పిల్లలకు దగ్గరలోనే ఉద్యోగాలు

ఓ పదేళ్ల నుంచీ సాఫ్ట్‌వేర్ చదువులపైనే పిల్లలు ఆసక్తి చూపుతున్నారు. కానీ తగిన అవకాశాలు మాత్రం దగ్గరలో లేవు. రాష్ట్ర విభజన తర్వాత హైదరాబాద్ కొలువులు కూడా దూరమయ్యాయి. మన దగ్గర చెప్పుకోదగిన కంపెనీలు లేవు. దీంతో 2019కి ముందు టీడీపీ అధికారంలో ఉండగా మొదలుపెట్టిన అమరావతి రాజధానిలో ఐటీ కంపెనీలకూ పెద్దపీట వేశారు. మైక్రోసాఫ్ట్, విప్రో, టీసీఎస్ వంటి పెద్ద సంస్థల ఏర్పాటుకు చంద్రబాబు ప్రత్యేక చొరవ తీసుకొని అటు విశాఖ, ఇటు అమరావతిలోను భారీ రాయితీలిచ్చారు. అయితే జగన్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అమరావతిలోని నిర్మాణంలో ఉన్న ఐటీ కంపెనీలన్నీ రాష్ట్రం నుంచి పారిపోయాయి. దీంతో ఐటీ కొలువుల కోసం యువత బెంగళూరు, చెన్నై, హైదరాబాద్‌లకే వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ బెంగ తీరనుంది. అమరావతి రాజధాని ప్రాంతంలో మళ్లీ సాఫ్ట్‌వేర్ కంపెనీలు వచ్చేవిధంగా సీఎం చంద్రబాబు ఇప్పటికే కసరత్తు చేశారు. దీంతో అంతర్జాతీయ కంపెనీలతోపాటు మధ్య, చిన్నతరహా ఐటీ కంపెనీలు పెద్దఎత్తున రానున్న కాలంలో కార్యకలాపాలు ప్రారంభించనున్నాయి. మన ఐటీ పిల్లలకు స్వల్ప దూరంలోనే ఉద్యోగ అవకాశాలూ లభించనున్నాయి.

● ప్రజాప్రతినిధులకూ అందుబాటులో..

ఉమ్మడి తూర్పుగోదావరిలో 23 నియోజకవర్గాలు ఉన్నాయి. గతంలో హైదరాబాద్ రాజధానిగా ఉండే సమయంలో ఒక్కరోజు పనిపై అక్కడికి వెళ్లాల్సి వచ్చినా ప్రయాణకాలంతో కలిపి రెండు రోజుల సమయం పట్టేది. నియోజకవర్గంలో అకస్మాత్తుగా ఏదైనా ఘటన జరిగినా హాజరు కావడానికి నానా ఇబ్బందులు పడాల్సి వచ్చేది. హైదరాబాద్ నుంచి ఈ ప్రాంతానికి రావాలంటే కారులో సుమారు పది గంటలు పడుతుంది. రైలులో అయితే రాత్రి రైలెక్కితే ఉదయం హైదరాబాద్ చేరుకుంటారు. ఇప్పుడు ఉమ్మడి తూర్పునకు రాష్ట్ర రాజధాని 500 కిలోమీటర్ల నుంచి 200 కిలోమీటర్ల చేరువకు వచ్చేసింది. దీంతో ఎమ్మెల్యేలు అసెంబ్లీ సమావేశాలకు సైతం ముందు రోజు కాకుండా అదేరోజున ఉదయం బయలుదేరి వెళ్లి సాయంత్రానికి మళ్లీ నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండే వెసులుబాటు కలిగింది. ప్రజాసంక్షేమం, అభివృద్ధికి సంబంధించి సీఎం కార్యాలయం, రాష్ట్ర సచివాలయం, రాష్ట్రస్థాయి అధికారులు, మంత్రుల కార్యాలయాల్లో పనులున్నా ఇలా బయలుదేరివెళ్లి.. అలా రాత్రికి వచ్చేయవచ్చు. దీంతో శ్రమ తగ్గడంతోపాటు ప్రజలకు ప్రజాప్రతినిధులు అందుబాటులో ఉండే సమయం గణనీయంగా అదా అవుతోంది. అదే జగన్ చెప్పినట్లు మూడు రాజధానులైతే.. ఒక ఎమ్మెల్యే ఇక్కడి నుంచి బయలుదేరి అసెంబ్లీ సమావేశాలకు విజయవాడ వెళ్లి, అక్కడి నుంచి అధికారులతో పనులకు విశాఖ చేరుకొని, కోర్టు పనులుంటే కర్నూలు వెళ్లి రావాలంటే ఎంత కష్టం.

అమరావతి సభకు భారీగా తరలివెళ్లిన కూటమి శ్రేణులు

అమలాపురం, మే 2(ఆంధ్రజ్యోతి): అమరావతిలో ప్రధాని మోదీ పాల్గొనే సభకు కోనసీమజిల్లా నుంచి వివిధ పార్టీల నేతలు, ప్రజాప్రతినిధులు పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. ప్రత్యేక బస్సులు ఏర్పాటు ద్వారా డ్వాక్రా సంఘాల మహిళలు, ఇతర నాయకులను సమీకరించి సభకు తరలించారు. అమరావతిలో జరిగే సభ కోసం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నేతలు జనసమీకరణ భారీగా చేపట్టారు. దీనిలోభాగంగా జిల్లావ్యాప్తంగా 50కుపైగా బస్సుల్లో వీరంతా తరలివెళ్లారు. ముమ్మిడివరం ప్రాంతంనుంచి ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద ఆధ్వర్యంలో 12 బస్సులు, కారుల్లో డ్వాక్రా సంఘాల మహిళలు, ఆర్పీలు, కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. జిల్లాలోని వివిధ నియోజకవర్గాల నుంచి భారీగా నేతలు కార్లలో ప్రధాని సభకు తరలించారు. అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్, మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరంతోపాటు కోనసీమకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు, బీజేపీ, జనసేన, కూటమి నాయకులు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. ఆయా పార్టీల నాయకులు ఎక్కడికక్కడే జనసమీకరణ చేసి సీఎం చంద్రబాబు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఈ సభను విజయవంతం చేయడంలో తమవంతు కృషి చేశారు. జిల్లాలోని వివిధ హోదాల్లో ఉన్న పలువురు అధికారులు కూడా సభకు వెళ్లారు.



కొత్తపేటనుంచి అమరావతి సభకు బయలుదేరుతున్న నేతలు

స్థాయీ సంఘాలు సూచించిన అంశాలపై చర్యలు చేపట్టాలి

- జడ్పీ చైర్మన్ విప్పర్తి

7



జాబ్‌మేళా పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్

6న రాజోలులో జాబ్‌మేళా

అమలాపురం, మే 2(ఆంధ్రజ్యోతి): ఈ నెల 6న రాజోలులో వికాస్, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్‌మేళా పోస్టర్లను కలెక్టర్ మహేష్‌కుమార్ శుక్రవారం ఆవిష్కరించారు. వికాస, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థతోపాటు ఏ1 సేవాసమితి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాబ్‌మేళాలలో 37 కంపెనీలు 1547 ఖాళీలను భర్తీ చేసేందుకు ముఖాముఖి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నాయని ఆయన తెలిపారు. నిరుద్యోగ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉపాధి అవకాశాలు పొందాలని సూచించారు. రాజోలు డిగ్రీ కళాశాలలో రిజిస్ట్రేషన్ డెస్క్ ఇంటర్వ్యూ గదులు, కంపెనీల బూత్‌లు,వెయిటింగ్ ఏరియాలు వంటివి ఏర్పాటు చేశామని వికాస జిల్లా మేనేజర్ గోళ్ల రమేష్ తెలిపారు. 10వతరగతి నుంచి పీజీ వరకు విద్యావంతులైన 35ఏళ్లలోపు వయసు కలిగినవారు ఈ జాబ్‌మేళాలో పాల్గొనవచ్చునని యన సూచించారు.

సీజన్ వ్యాధులపట్ల ప్రజలను అప్రమత్తం చేయండి

జిల్లా మలేరియా అధికారి

కె.గంగవరం, మే2(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపట్ల ప్రజలను వైద్య సిబ్బంది అప్రమత్తం చేయాలని జిల్లా మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఆయన కె.గంగవరం మండలం పేకేరు ప్రభుత్వాస్పత్రిని తనిఖీ చేశారు. మలేరియా జ్వరాల వివరాలకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. పలు సూచనలు చేశారు. డెంగ్యూ, మలేరియా పట్ల ప్రజల్ని అప్రమత్తం చేయడంకోసం ప్రభుత్వం ముద్రించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ మర్రి శ్రీలక్ష్మి, సబ్‌యూనిట్ ఆఫీసర్ ఎంపీవీ సత్యనారాయణ, ఎంపీహెచ్‌ఈవో మూర్తి, ఎంపీహెచ్ ఎస్ మంగాదేవి పాల్గొన్నారు.



మలేరియాపై అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కాకినాడ రూరల్‌లో రాష్ట్రస్థాయి బీచ్ కబడ్డీ పోటీలు ప్రారంభం

- ఏపీకి చెందిన 26 పురుషుల, మహిళా జట్లు హాజరు
- హోరాహోరీగా తలపడిన జిల్లా జట్ల క్రీడాకారులు

7



పోటీల్లో తలపడుతున్న శ్రీకాకుళం, తూర్పుగోదావరి జిల్లాల మహిళా క్రీడాకారులు



రాష్ట్రస్థాయి బీచ్ కబడ్డీ పోటీల్లో భాగంగా క్రీడాకారులనుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న అతిథులు

టార్గెట్ పెంచండి

- జిల్లాలో అరకొర టార్గెట్‌లతో రైతుల ఇబ్బందులు
- కళ్లాల్లో ధాన్యపు రాశులు.. హడలెత్తిస్తున్న వరుణుడు
- జిల్లావ్యాప్తంగా 6,23,529 మెట్రిక్ టన్నుల దిగుబడి లక్ష్యం
- 34శాతం మాత్రమే కొనుగోలుకు టార్గెట్‌లు
- ఇప్పటివరకు 65,742 ఎకరాల్లో కోతలు పూర్తి
- ఆందోళనలో రైతులు.. మంత్రి దృష్టికి టార్గెట్‌ల వ్యవహారం



పి.గన్నవరంలో వర్షపు చినుకులు రావడంతో బరకాలతో ధాన్యం రాశులను కప్పుతున్న కూలీలు

పి.గన్నవరం, మే 2(ఆంధ్రజ్యోతి): ఈసారి జిల్లావ్యాప్తంగా వరి రైతులు ఆశించినస్థాయిలో పంట దిగుబడులు సాధించారు. ప్రభుత్వం పంటకోత ప్రయోగాల ఆధారంగా నిర్దేశించిన లక్ష్యాల దిశగా దిగుబడులు వస్తున్నాయి. ఒకపక్క రైతుల్లో ఆనందంఉన్నా వాతావరణంలో మార్పులతో ఆందోళన చెందుతున్నారు.

జిల్లావ్యాప్తంగా ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం 34శాతం మాత్రమే టార్గెట్‌లు ఇవ్వడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండో పంటలో ఈసారి 1121, పిఆర్-126, బొండాలు, 111రకాలను రైతులు ఎంచుకున్నారు. తక్కువ రోజుల్లో పంటచేతికి వచ్చే పీఆర్-126 రకం ధాన్యం మంచి దిగుబడులు వస్తున్నాయని అధికారులు చెప్తున్నారు. ఈ రకం ధాన్యాన్ని మొదట్లో కొనుగోలు చేయడానికి ప్రభుత్వం ముందుకు రాకపోవడంతో ఈ విషయాన్ని పలువురు ప్రజాప్రతినిధులు ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో సంబంధిత రకాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి మిల్లర్ల వద్దకు పంపినా వారు కొర్రీలు పెట్టి మద్దతు ధరకు కోతలు పెడుతున్నారని రైతులు చెప్తున్నారు. మిల్లులు వద్దకు వెళ్లిన తర్వాత రూ.50నుంచి రూ.70 వరకు కోత విధిస్తున్నారని వాపోయారు. కాగా ప్రభుత్వం నిర్దేశించిన టార్గెట్‌లు పూర్తయ్యాయని బయటమార్కెట్‌లో విక్రయించుకోవాలని అధికారులు సూచిస్తున్నట్లు రైతులే బహిరంగంగా చెప్తున్నారు. తీరా మిల్లుకు పంపితే బస్తాకు రూ.1600 చొప్పున ఇచ్చినా ఖర్చులు మినహా చేతికి రూ.1500 వస్తోందని ఆవేదన చెందుతున్నారు. దీంతో ఎక్కువ రోజులు ధాన్యం కళ్లాల్లోనే దర్శనమిస్తోంది. వాతావరణంలో మార్పులతో రైతులకు కంటిమీద కునుకు ఉండడంలేదు. మండపేట, కె.గంగవరం, రామచంద్రపురం, కపిలేశ్వరపురం, ఆలమూరు తదితర మండలాల్లో ఇప్పటికే 50 శాతంపైగా కోతలు పూర్తయ్యాయి. మిగిలిన మండలాల్లో ఇప్పుడిప్పుడే కోతలు ఊపందుకున్నాయి.

ఈ టార్గెట్ ఎలా..?

జిల్లావ్యాప్తంగా రెండో పంటకు సంబంధించి 1,64,529ఎకరాల్లో రైతులు ధాన్యం పండించారు. దీనికిగాను పంటకోత ప్రయోగాలు ఆధారంగా 6,23,529 మెట్రిక్‌టన్నుల ధాన్యందిగుబడి లక్ష్యాన్ని ప్రభుత్వం ప్రకటించింది. 34శాతం కొనుగోళ్లకు మాత్రమే అనుమతులు ఇచ్చింది. ఈ మేరకు జిల్లాలోని ఆయా మండలాల్లో గ్రామాల వారీగా పంటశాతాన్ని బట్టి టార్గెట్‌లను నిర్దేశించారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు 65,742 ఎకరాల్లో మాత్రమే కోతలు పూర్తికాగా 2,50,643 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చింది. ఈ దిగుబడిలో 4,004 మెట్రిక్ టన్నులు బయట మార్కెట్‌ల్లో విక్రయించారు. 99,589 ఎకరాల్లో కోతలు పూర్తికావాల్సి ఉండగా మరో 3,72,886 మెట్రిక్ టన్నుల ధాన్యం లభ్యం కానుంది. దిగుబడి మెండుగాఉన్నా టార్గెట్‌లు లేకపోవడంతో దళారుల ఇష్టారాజ్యం నడుస్తోంది.

టార్గెట్‌లు పెంచాలని మంత్రి దృష్టికి తీసుకువెళ్లాను

రైతులు పండించిన ప్రతి గింజను రాష్ట్రప్రభుత్వం కొనుగోలు చేస్తుంది. టార్గెట్‌ల విషయం పలువురు రైతులు నా దృష్టికి తీసుకువచ్చారు. మంత్రి నాదెండ్ల మనోహర్‌తో మాట్లాడాను. జిల్లా జేసీతో మాట్లాడానని, త్వరలోనే టార్గెట్‌లు పెంచే విధంగా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. సివిల్ సప్లయి ఎండీకి లేఖ రూపంలో తెలియజేశాను. పూర్తిస్థాయిలో రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేసి మద్దతు ధర ఇప్పిస్తాం.

-గిడ్డి సత్యనారాయణ, పి.గన్నవరం ఎమ్మెల్యే

టార్గెట్‌ల విషయంలో అపోహలు నమ్మొద్దు

టార్గెట్‌ల విషయంలో అపోహలు నమ్మొద్దు. దిగుబడికి అనుగుణంగా దశలువారీగా టార్గెట్‌లు వస్తాయి. ఆ దిశగా కృషి చేస్తాం. పీఆర్-126 రకాన్ని ప్రభుత్వం పూర్తిస్థాయిలో కొనుగోలు చేయడానికి ఇప్పటికే చర్యలు తీసుకున్నాం. టార్గెట్‌ల విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. కొద్దిమేర జాప్యం జరుగుతుంది అదనపు టార్గెట్‌లను పెంచి రైతుల ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేసే బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

-మోకా ఆనందసాగర్, రాష్ట్ర సివిల్ సప్లయిస్ డైరెక్టర్

బీచ్ రిసార్ట్స్ అభివృద్ధికి.. ముందుకు రండి



కలెక్టరేట్‌లో హోటళ్లు, రిసార్ట్స్ యాజమాన్య ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్

- హోటల్స్, రిసార్ట్‌ల యజమానులతో భేటీలో కలెక్టర్
- పర్యాటక ప్రాంతంగా కోనసీమను అభివృద్ధి చేయండి
- కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, మే 2(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని సముద్రతీరప్రాంతంలో పర్యాటక అభివృద్ధికి పెట్టుబడులు పెట్టే రిసార్ట్స్ హోటల్ యాజమాన్యాలను ఆహ్వానిస్తున్నట్టు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పేర్కొన్నారు. అమలాపురంలోని కలెక్టర్ కార్యాలయంలో రిసార్ట్స్, హోటల్ రెస్టారెంట్‌ల ప్రతినిధులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 93 కిలోమీటర్ల మేర సముద్ర తీర ప్రాంత ఉందని, ఈ ప్రాంతంలో ఆధ్యాత్మిక టూరిజం కూడా అభివృద్ధి చెందుతున్నందున రిసార్ట్స్ హోటళ్లు, రెస్టారెంట్‌ల నిర్మాణానికి ఔత్సాహిక వ్యాపారవేత్తలు ముందుకువచ్చి అభివృద్ధి చేయాలని కోరారు. కాకినాడకు చెందిన అగామీ ఫుడ్స్ హైదరాబాద్‌కు చెందిన హోటల్స్ రిసార్ట్స్ ఏఆర్‌ఆర్బీఐ గ్రూపు ప్రతినిధులు, పెట్టుబడిదారులతో జిల్లాలో టూరిజం అభివృద్ధిపై వారికి అవగాహన కల్పించారు. టూరిజం అధికారి వెంకటాచలం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తీర ప్రాంతంలో పర్యాటకులను ఆకర్షించే ప్రదేశాలు, దేవాలయాలు వంటి సమాచారాన్ని వారికి వివరించారు. దీనిద్వారా బీచ్‌సర్క్యూట్ పర్యాటకాన్ని ప్రోత్సహించాలన్న ప్రతిపాదనలను ప్రతినిధుల ముందు కలెక్టర్ చర్చించారు. స్వదేశీ దర్శన్ స్కీములో వైనతేయనదికి దగ్గరగా పాశర్లపూడి, ఆదుర్రు బౌద్ధస్థూపం, సముద్ర ముఖద్వారంవద్ద అన్ని విధాలుగా రిసార్ట్స్, రెస్టారెంట్‌ల అభివృద్ధికి బోటింగ్ వంటి అవకాశాలు బ్యాక్ వాటర్‌తో ఉన్నాయని తెలిపారు. ఎస్.యానాంలో రిసార్ట్స్, వాటర్ స్పోర్ట్స్ వంటివి ఏర్పాటుచేసుకునేందుకు వీలుగా మూడు ఎకరాల భూమి సిద్ధంగా ఉందన్నారు. కోటిపల్లిలో రిసార్ట్స్ నిర్మితమై ఉన్నాయని, వాటిని ఉపయోగంలోకి తీసుకురావాలని సూచించారు. తమ సూచనలపై ప్రతినిధి బృందాలు అధ్యయనం చేయాలని కోరారు. ద్రాక్షారామ భీమేశ్వరాలయం, కోటిపల్లి సోమేశ్వరస్వామి, అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి, ర్యాలి జగన్మోహిని కేశవస్వామి, వాడపల్లి వేంకటేశ్వరస్వామి వంటివి మేజర్‌గా 17దేవాలయాలున్నాయని, ఆలయాల సర్క్యూట్ ఆధారంగా జిల్లాలో 20వరకు బీచ్‌లు ఉన్నాయని తెలిపారు. టీవీ సీరియళ్లు, ప్రముఖ చిత్ర నిర్మాణాలు ఈ ప్రాంతంలోనే జరుగుతున్నందున వారికి అవసరమైన రిసార్ట్స్ హోటల్స్ స్టే హోమ్స్ నిర్మిస్తే పర్యాటకంగా ఈ ప్రాంతం అభివృద్ధిచెందుతుందన్నారు. ఇక్కడి సంస్కృతి, సంప్రదాయాలు, ఆలయాలప్రాముఖ్యత వంటి అనేక అంశాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం తరపున ఇన్వెస్టర్లకు మెరుగైన రాయితీలు కల్పిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. పెట్టుబడిదారులు ముగ్గురు ప్రతినిధులు సమావేశం అనంతరం బీచ్, ఆలయాల సందర్శనకు పర్యాటక రంగ అధికారులతో సందర్శనకు బయలుదేరివెళ్లారు. జిల్లాపర్యాటక ప్రాంతీయ సంచాలకులు పవన్‌కుమార్,ఫుడ్ కంపెనీ ప్రతినిధి ఎస్.మూర్తి, ఆర్వీ గ్రూప్ ప్రతినిధి సతీష్‌వెంకటరమణ, వి రిసార్ట్స్ ఎండీ సంపత్, జీఎం చంద్రప్రకాష్ పాల్గొన్నారు.



అద్భుతంగా అమరావతి



పవన్ స్వాగతం.. లోకేశ్ మోదీ చమత్కారం



కాజ టోల్ గేట్ వద్ద బారులు తీరిన వాహనాలు

సభా ప్రాంగణంలోనే వైద్య సేవలు

అద్వితీయంగా శంకుస్థాపన వేడుక ● రాజధాని గ్రామాల్లో తిరునాళ్ల సందడి

వినాశనం నుంచి వికాసం దిశగా.. అమరావతి పరుగులు పెట్టేందుకు సిద్ధమైంది. శిథిలం నుంచి ప్రపంచం అచ్చెరువొందేలా ఆంధ్రుల కలల రాజధాని పునర్నిర్మాణం దిశగా పయనించనున్నది. ఈ అపురూప కార్యక్రమానికి శుక్రవారం రాజధాని పరిధిలోని వెలగపూడి వేదికగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ శ్రీకారం చుట్టారు. అమరావతి అభివృద్ధి మనమే చేయాలి.. మనమే చేస్తాం.. అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సాక్షిగా పిలుపిచ్చారు. దేవతల రాజధాని అమరావతి దేశాభివృద్ధికి కేంద్రంగా మారుతోందని.. ఆ స్థాయిలో అభివృద్ధి చేస్తామని మోదీ ప్రజల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. ఇక అమరావతి కేంద్రంగా వివిధ ప్రాజెక్టులతో పాటు రాష్ట్రంలోని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ప్రధాని మోదీ వివిధ ప్రాజెక్టులను ప్రారంభించి జాతికి అంకితం చేశారు. పునర్నిర్మాణ శంకుస్థాపన మహోత్సవానికి అతిరథ మహారథులతో పాటు ప్రధాన మంత్రి మోదీ రాకతో రాజధాని గ్రామాల్లో తిరునాళ్ల వాతావరణం సంతరించుకుంది. రాష్ట్రవ్యాప్తంగా తరలివచ్చిన జనాలతో రాజధానిలో పండుగ వాతావరణం కనిపించింది. - తుళ్లూరు, ఆంధ్రజ్యోతి



మహిళల విజయ దరహాసం





దుర్గ గుడి నుంచి సభా వేదిక వద్దకు సైకిల్‌పై వస్తున్న విజయనగరం ఎంపీ అప్పల నాయుడు



సభా వేదిక వద్దకు తరలివస్తున్న విద్యార్థినులు



సభా వేదిక వద్ద ఏర్పాటు చేసిన భోజనాలు



గ్యాలరీల బయట జనం



భీమ కవి పాల రాతి విగ్రహం

వేములవాడలో భీమ కవి ఆలయం

విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు ప్రారంభం

భీమ కవి విగ్రహాన్ని ఊరేగించిన గ్రామస్తులు

కరప, మే 2 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప మండలం వేములవాడలో వేములవాడ భీమ కవి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ద్రాక్షారామ భీమేశ్వరస్వామి వరపుత్రుడిగా ప్రాశస్త్యం పొందిన భీమ కవికి గ్రామస్తులు రూ.50 లక్షలతో నూతన ఆలయాన్ని నిర్మించారు. అందులో పాల రాతి విగ్రహాన్ని ఆదివారం ప్రతిష్ఠించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. శుక్రవారం భీమ కవి విగ్రహాన్ని పుష్పాలతో అలంకరించిన ప్రత్యేక వాహనంలో ఉంచి పలు సాంస్కృతిక ప్రదర్శనల నడుమ వేములవాడ, వలసపాకల గ్రామాల్లో ఊరేగించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన యాగశాలలో శనివారం హోమాలు, ప్రత్యేక పూజలు జరుగుతాయని ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. పూజ్యం విశ్వనాథ శివాచార్య ఆధ్వర్యంలో భైరవభొట్ల మాచరి బ్రహ్మాజీ శర్మ పర్యవేక్షణలో ఆదివారం ఉదయం నుంచి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు వైభవంగా జరుగుతాయని, అనంతరం భారీ అన్నసంతర్పణ నిర్వహిస్తామని కమిటీ ప్రతినిధులు వివరించారు. ఊరేగింపులో కరప డీసీ చైర్మన్ పీజీ సత్యనారాయణ, మీసాల రాంబాబు, బండే తాతాజీ, పాలికవీ ర్రాజు, సూరిబాబు, అప్పనపల్లి శ్రీవెంకటనారయ్య, పెద్ద, వజ్రపు కామేశ్వరరావు, పుణ్యమంతుల అప్పారావు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



వేములవాడ భీమకవి జన్మస్థలంగా పేర్కొంటూ ఏర్పాటుచేసిన ముఖద్వారం



నూతనంగా నిర్మించిన భీమ కవి ఆలయం



భీమ కవి విగ్రహాన్ని ఊరేగిస్తున్న వేములవాడ గ్రామస్తులు



భారత్-వియత్నాం మధ్య బలమైన సాంస్కృతిక బంధం

రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్

రాజమహేంద్రవరం, మే 2 (ఆంధ్రజ్యోతి): భారత్-వియత్నాం నడుమ ఆధ్యాత్మిక సామరస్యం, బలమైన సాంస్కృతిక బంధాన్ని పెంపొందించే విధంగా వియత్నాం బౌద్ధ విశ్వవిద్యాలయంలో బుద్ధ భగవానుని అవశేషాల ప్రతిష్ఠ వైభవంగా జరిగిందని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. గురువారం రాత్రి న్యూఢిల్లీలోని ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ వద్ద దేశంలోని వివిధ ప్రాంతాల్లో భద్రపరిచిన బుద్ధుడి పవిత్ర అస్థికలు, అవశేషాల పేటికకు నమస్కరించి ఐఏఎఫ్‌కు చెందిన హెర్క్యులస్ అనే ప్రత్యేక విమానంలో పవిత్ర ప్రయాణం ప్రారంభించామన్నారు. వియత్నాం చేరుకుని శుక్రవారం బౌద్ధ విశ్వవిద్యాలయంలోని బుద్ధ హాలులో అంగరంగ వైభవంగా వాటిని ప్రతిష్ఠించామన్నారు. కేంద్ర మంత్రి కిరణ్ రిజిజుతో కలిసి బుద్ధుని పవిత్ర అవశేషాలను వియత్నాం తీసుకెళ్లే అవకాశం దక్కడం గర్వంగా భావిస్తున్నానని తెలిపారు. ఈ నెల 6వ తేదీ వరకు వియత్నాంలో జరిగే బుద్ధ భగవానుని అవశేషాల ప్రదర్శన వేడుక భారతీయ నాగరికత, శాంతియుత సహన వారసత్వానికి శాశ్వత సాక్ష్యంగా నిలుస్తుందని మంత్రి చెప్పారు.





బుద్ధ భగవానుని అవశేషాల ప్రతిష్ఠలో పాల్గొన్న కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్



మురమళ్లలో రెండో రోజుకు బ్రహ్మోత్సవాలు

చంద్రప్రభ వాహనంపై ఊరేగిన వీరేశ్వరస్వామి

ఐ.పోలవరం, మే 2 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మురమళ్లలో శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. రెండో రోజైన శుక్రవారం యనమండ్ర సత్యసీతారామశర్మ ఆధ్వర్యంలో గవ్యాంతం, వాస్తు పూజ, వాస్తు హోమం నిర్వహించారు. స్వామికి అభిషేకం, లక్ష్మీగణపతి హోమం, రుద్ర హోమం జరిపించారు. స్వామి చంద్రప్రభ వాహనంపై ఆశీనులై పురవీధుల్లో ఊరేగి భక్తులకు దర్శనమిచ్చారు. సహాయ కమిషనరు మాచిరాజు లక్ష్మీనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



లక్ష్మీగణపతి హోమం నిర్వహిస్తున్న పండితులు

రాష్ట్ర క్రీడగా కబడ్డీ గుర్తింపునకు కృషి

● అట్టహాసంగా 12వ రాష్ట్ర బీచ్ కబడ్డీ పోటీలు ● హోరాహోరీగా సాగిన పోటీలు


జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పంతం నానాజీ, కలెక్టర్ షాన్‌మోహన్

సర్పవరంజంక్షన్, మే 2(ఆంధ్రజ్యోతి): గ్రా మీణ ప్రాంతాల్లో ఉన్న యువతను ప్రోత్సహించి వారిని రాష్ట్ర, జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషిచేస్తుందని, ప్రస్తుతం ఉన్న 2శాతం రిజర్వేషన్‌ని 3శాతానికి సీఎం చంద్రబాబు పెంచి క్రీడలపై ఉన్న ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని కాకినాడరూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ పేర్కొన్నారు. శుక్రవారం కాకినాడరూరల్ సూర్యారావుపేట ఎన్టీఆర్ బీచ్‌లో ఎమ్మెల్యే పంతం నానాజీ సహకారంతో ఏపీ కబడ్డీ అసోసియేషన్, జిల్లా కబడ్డీ అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో మూడు రోజులపాటు జరిగే ఏపీ ఆంధ్ర 12వ అంతర్ జిల్లాల బీచ్ కబడ్డీ- 2025 చాంపియన్‌షిప్ పోటీలను జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి, ఎమ్మెల్యే పంతం నానాజీ జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సందర్శకులకు ఆహ్లాదాన్ని అందించే సముద్రతీరంలో బీచ్ కబడ్డీ పోటీలు నిర్వహించడం ఆనందంగా ఉంద న్నారు. బీచ్ సందర్శనకు వచ్చే పర్యాటకులకు సముద్ర తీరం పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేయాలన్నారు. గత నాలుగు నెలలుగా బీచ్‌ని అత్యంత పరిశుభ్రంగా ఉంచేందుకు మున్సిపల్,పంచాయతీ సిబ్బంది విశేషంగా సేవలందిస్తున్నారన్నారు. రాబోయే 3 నెలల్లో సుమారు రూ. 2.5కోట్లతో పలుఅభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామన్నారు. పర్యాటకులకు కనీస అవసరాలైన మరుగుదొడ్లు, తాగునీరు, లైట్లు, బెంచీలు వంటి సౌకర్యాలు కల్పిస్తామన్నారు. సముద్రతీరాన్ని కలుషితం చేయకుండా అధికారులకు సహకరించాలని, బీచ్‌ని అపరిశుభ్రంచేసే వారిపై కేసుల నమోదుకు వెనుకాడబోయే ప్రశక్తేలేదన్నారు. ఎన్టీఆర్ బీచ్‌లో గతంలో బీచ్ ఫెస్టివల్ నిర్వహించేవారని, కరోనా తదితర కారణాలతో బీచ్‌లో ఎటువంటి కార్యక్రమాలు జరగకపోవడంతో రాష్ట్ర బీచ్ కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే పంతం నానాజీ తెలిపారు. మే 2 నుంచి 4 వరకు ఏపీకి చెందిన 26 పురుషుల, మహిళా జట్లు ఈ పోటీల్లో పాల్గొంటారన్నారు. క్రీడలద్వారా శారీరక దారుఢ్యంతోపాటూ ఆరోగ్యం లభిస్తుందన్నారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు సీఎం చంద్రబాబు విశేష కృషి చేస్తున్నారన్నారు. కబడ్డీ క్రీడను రాష్ట్ర క్రీడగా గుర్తింపు ఇవ్వాలని, ప్రో కబడ్డీగా దేశవ్యాప్త గుర్తింపు లభించిందన్నారు. పర్యాటకులకు ఆహ్లాదన్నందించే బీచ్‌లో రానున్న రోజుల్లో మరిన్ని క్రీడా పోటీలను నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఇక్కడ పోటీల్లో ప్రతిభచూపిన క్రీడాకారులను ఈనెల 15-20 నుంచి మచిలీపట్నంలో జరిగే అంతర్జాతీయ బీచ్ కబడ్డీ పోటీలకు ఎంపిక చేస్తామని ఏపీ కబడ్డీ అసోసియేషన్ ప్రెసిడెంట్ వెంకటరెడ్డి తెలిపారు. బీచ్ సుందరీకరణకు కృషిచేస్తున్నామని, అతిత్వరలో ఎయిర్‌క్రాఫ్ట్ మ్యూజియం సందర్శకులకు అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ భావన తెలిపారు. ముందుగా రాష్ట్రం నుంచి ఇక్కడకు విచ్చేసిన 26 మహిళా పురుషుల క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. బెలూన్లను గాల్లోకి ఎగురవేసి, క్రీడాజ్యోతిని వెలిగించి కలెక్టర్ పోటీలను ప్రారంభించారు. సాయం సమయాన సుందర తీరాన ఎన్టీఆర్ బీచ్‌లో ఫ్లడ్‌లైట్ల వెలుతురులో జరిగిన కబడ్డీ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. క్రీడాకారులు రెట్టించిన ఉత్సాహంతో కబడ్డీ ఆడారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ ఎన్వీవీ సత్యనారాయణ, డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్, క్రీడా అభివృద్ధి అధికారి శ్రీనివాసకుమార్, జడ్పీ సీఈవో లక్ష్మణరావు, డ్వామా పీడీ వెంకటలక్ష్మి, కేఎస్‌పీఎల్ సీఈవో మురళీధర్, ఎంపీపీ నందిపాటి అనంతలక్ష్మి, ఏపీ గౌడ, ఎస్సీ కార్పొరేషన్ల డైరెక్టర్లు మట్టాప్రకాశ్ గౌడ్, కొల్లాబత్తుల అప్పారావు, శిరంగు శ్రీనివాసరావు, కరెడ్ల గోవిందు, జీని శ్రీనివాస్, సోదె ముసలయ్య, వీరబాబు, రాజు పాల్గొన్నారు.


కాకినాడ ఎన్టీఆర్ బీచ్‌లో జరుగుతున్న బీచ్ కబడ్డీ పోటీలో తలపడుతున్న తూర్పుగోదావరి, శ్రీకాకుళం జట్లు


తూర్పుగోదావరి, చిత్తూరు పురుషుల జట్ల మధ్య హోరాహోరీగా జరుగుతున్న కబడ్డీ పోటీ

ఒకే జీడి మామిడి పండుకు మూడు గింజలు


మూడుపిక్కల జీడిమామిడి పండు

● ఆశ్చర్యంగా తిలకిస్తున్న గ్రామస్థులు

మలికిపురం మండలం పడమటిపాలెంలో అంబటి లక్ష్మీనారాయణకు చెందిన జీడి తోటలో ఒక జీడి పండుకు మూడు గింజలు కాశాయి. సాధా రణంగా ఒక జీడిమామిడిపండుకు ఒక గింజమాత్రమే ఉంటు ంది. పడమటివారిపాలెంలో మాత్రం ఒక పండుకు మూడు గింజలు ఉండటం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. దీనిని పలువురు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

మలికిపురం, మే 2(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా


కల్యాణోత్సవ ఏర్పాట్లపై సిబ్బందితో సమీక్షిస్తున్న ఈవో సుబ్బారావు

సమన్వయంతో పనిచేయండి

● ఉద్యోగులు ఎవరూ సెలవులు పెట్టకండి
● కల్యాణోత్సవ ఏర్పాట్లపై ఈవో సమీక్ష

అన్నవరం, మే 2 (ఆంధ్రజ్యోతి): ఈనెల 7 నుంచి ప్రారంభమయ్యే సత్యదేవుడి దివ్యకల్యాణోత్సవాలపై ఈవో వీర్ల సుబ్బారావు సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముందు ఎవరెవరువచ్చారు ఎవ రైనా గైర్హాజరయ్యారా అంటూ ప్రశ్నించారు. అనంతరం కల్యాణోత్సవాల సమయంలో ఎవరూ సెలవులు పెట్టకండి సమన్వయంతో పనిచేయండి అని సూచించారు. ప్రధానంగా స్వామివారి కల్యాణం జరిగే 8వ తేదీ, రథోత్సవం జరిగే 11న భక్తజనం అధికంగా ఉండడంతో వారికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. అయితే సమీక్షలో పాల్గొన్న ఉద్యోగులు మాత్రం ప్రధానాంశాలు చర్చించకపోవడంతో పెదవి విరిచారు.

ఘనంగా ఆదిశంకరాచార్యుల జయంతి

అన్నవరం, మే 2 (ఆంధ్రజ్యోతి): హిందూధర్మస్థాపనకు విశేష కృషిచేసిన జగద్గురువులు ఆదిశంకరాచార్యుల జయంతి పురస్కరించుకుని శుక్రవారం సత్యదేవుడి సన్నిధిలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 10గంటలకు ఆదిశంకరాచార్యుల చిత్రపటం పల్లకీలో ఉంచి పండితులు మంత్రోచ్ఛరణలు, హరిహర శంకర, జయజయశంకర నినాదాలతో ఆలయ తూర్పురాజగోపురం చుట్టూ ముమ్మారు ప్రదక్షిణ చేయించారు. ఈవో సుబ్బారావు, ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం, ఆలయ ఏఈవో కొండలరావు, సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

శంకరాచార్యుల విగ్రహ ప్రతిష్ఠ

గ్రామంలో గురు దత్తాత్రేయ ఆలయంలో శంకరాచార్యులు విగ్రహప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఉద యం గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం పంచగవ్యప్రాశన, షోడషోపచార పూజలు నిర్వహించి ఉదయం 9.37కి కళాన్యాసం గావించారు. కార్యక్రమంలో దత్త సమా ఖ్య అధ్యక్షుడు మహేంద్రవాడ జగదీష్, వారణాశి సుబ్రహ్మణ్యశర్మ పాల్గొన్నారు.

సత్యగాయిత్రి బ్రాహ్మణసంఘం ఆధ్వర్యంలో:

సత్యగాయిత్రి బ్రాహ్మణసంఘం ఆధ్వర్యంలో శంకరజయంతి పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం సుబ్రహ్మణేశ్వర ఆలయంలో శంకరాచార్యుల విగ్రహానికి అభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం విశేష అన్నదాన కార్యక్రమం, సాయంత్రం 4గంటలకు ఆదిశంకరాచార్యుల చిత్రపటాలతో ఊరేగింపు నిర్వహించా రు. కార్యక్రమంలో ఈవో సుబ్బారావు, సర్పంచ్ కుమార్‌రా జా బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు డి.వి.జె.రమణమూర్తి, ప్రధాన కార్యదర్శి కామర్స్ చిరంజీవి పాల్గొన్నారు.


ఆదిశంకరాచార్యుల చిత్రపటాన్ని పల్లకీలో ఊరేగిస్తున్న దేవస్థానం పండితులు

గొర్రిపూడి వెల్ఫేర్ అసిస్టెంట్‌పై

హిజ్రాల దాడి

● గోల్డ్‌చైన్ అపహరణ
● కరప పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

కరప, మే 2 (ఆంధ్రజ్యోతి): కాకినాడజిల్లా కరప మండలం గొర్రిపూడి సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న అనుసూరి రవీంద్రపై గుర్తుతెలియని కొంతమంది హిజ్రాలు దాడిచేసి అతని మెడలోని బంగారు గొలుసును అపహరించుకుపోయారు. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. వెల్ఫేర్ అసిస్టెంట్ రవీంద్ర గత ఏప్రిల్ 30వ తేదీ మధ్యాహ్నం కాకినాడలోని ఒక బ్యాంక్ నుంచి పింఛను సొమ్ము డ్రా చేసి గొర్రిపూడి సచివాలయానికి బయలుదేరారు. కరప మండలం పాతర్లగడ్డ వచ్చేసరికి పలువురు హిజ్రాలు అతని బైక్‌ను చుట్టుముట్టి డబ్బులివ్వాల్సిందిగా డిమాండ్ చేశారు. బైక్ వెనుక ముందు ఎక్కి పింఛన్ల సొమ్ము ఉన్న బ్యాగ్‌ను లాక్కోబోయారు. వారి బాధ భరించలేక రవీంద్ర పర్స్‌లో నుంచి రూ.50 తీసి ఇవ్వగా సరిపోవని మరో రూ.100 గుంజుకున్నారు. వారిని వదిలించుకుని కొంతదూరం వచ్చి చూసుకోగా మెడలోని 10గ్రాముల బంగారు గొలుసు మాయమైనట్టు గుర్తించాడు. వెనక్కు వెళ్లి చూడగా హిజ్రాలు అక్కడి నుంచి పరారయ్యారు. దీనిపై బాధితుడు అదేరోజు సాయంత్రం కరప పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ తోట సునీత కొంతమంది హిజ్రాల వీడియోలు, ఫొటోలను చూపించగా వారు కాదని బాధితుడు నిర్ధారించినట్టు తెలిసింది. పెనుగుదురు-పాతర్లగడ్డ, పెనుగుదురు-కరప ప్రధాన రహదారులు, వేళంగి రైల్వేట్రాక్, నడకుదురు పరిసరాల్లో రాత్రుళ్లు హిజ్రాలు చేస్తున్న ఆగడాలు భరించలేకపోతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది యువకులను హిజ్రాలు ఆకర్షించి వారి నుంచి సొమ్ములు కాజేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. హిజ్రాల ఆగడాలకు అడ్డుకట్ట వేయాల్సిందిగా ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

స్థాయీ సంఘాలు సూచించిన అంశాలపై..

సత్వర చర్యలు చేపట్టాలి

● జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు


జడ్పీ స్థాయీ సంఘాల సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు

కాకినాడ, మే 2(ఆంధ్రజ్యోతి): స్థాయీ సంఘాలు చర్చించిన, సూచించిన అంశాలన్నింటిపైనా జిల్లాల అధికారులు సత్వర చర్యలు చేపట్టాలని జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు సూచించారు. తూర్పుగోదావరిజిల్లా పరిషత్ స్థాయీసంఘ సమావేశాలు శుక్రవారం జడ్పీ చైర్మన్, ఆయా సంఘాల చైర్మన్ల అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశాల్లో ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా పరిధిలోని నాలుగు నూతన జిల్లాల్లో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పురోగతిని ఆయా స్థాయీ సంఘాలు సమీక్షించి, మరింత పటిష్టత, సత్వర అమలుకు అధికారులకు సూచనలు చేశారు. ఆర్థిక, ప్రణాళిక అంశంపై చర్చలో గ్రామ పంచాయతీలకు రావాల్సిన స్టాంపు డ్యూటీ, సీనరేజీ సర్దుబాటు చెల్లింపులు వెంటనే జరపాలని, పంచాయతీల పరిధిలో జరిగే అన్ని పనులకు తప్పనిసరిగా పంచాయతీ తీర్మానాలతోనే నిర్వహించాలని సంఘాల సభ్యులు కోరారు. ఇప్పటికే చేసిన పనులకు సత్వరం చెల్లింపులు జరపాలని కోరారు. గ్రామీణాభివృద్ధిపై చర్చలో కొత్తగా పింఛన్ల మంజూరు కోసం వేచి ఉన్న అర్హులైన లబ్ధిదారులకు పింఛన్లు మంజూరు చేయాలని, ఇందుకు సంబంధిత వెబ్‌సైట్‌ను తెరవాలని సభ్యులు కోరారు. మహిళ, శిశు సంక్షేమంపై చర్చలో బాలికల రక్షణ, శారీరక, మానసిక వికాసం లక్ష్యంగా జిల్లాలో శుక్రవారంనుంచి నిర్వహిస్తున్న కిశోరి వికాసం సమ్మర్ క్యాంపెయిన్ కార్యక్రమాలు విజయవంతం చేసేందుకు మండల, గ్రామ స్థాయి ప్రజాప్రతినిధులను కూడా తప్పనిసరిగా భాగస్వాములు చేయాలని సభ్యులు కోరారు. సంక్షేమశాఖల చర్చలో వివిధ సంక్షేమ కార్పొరేషన్లద్వారా అమలుచేస్తున్న స్వయం ఉపాధి యూనిట్ల కోసం లబ్ధిదారుల ఎంపికలో జడ్పీటీసీ సభ్యుల సూచనలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. వైద్యఆరోగ్యశాఖలో ఖాళీ ఉన్న వైద్యులు, పీహెచ్‌సీల్లో ఖాళీగా ఉన్న వైద్యులు, సిబ్బంది పోస్టులను భర్తీచేసి వైద్యసేవలకు విఘాతం లేకుండా చూడాలని సభ్యులు కోరారు. విద్య అంశంపై టెన్త్ ఫలితాల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల విద్యార్థులు సాధించిన విజయాలను వివరించారు. విద్యుత్‌శాఖపై చర్చలో పీఎం సూర్యఘర్ పథకంద్వారా ఉమ్మడి జిల్లాల్లో అవకాశం ఉన్న ప్రతి కుటుంబానికి రూఫ్‌టాప్ సోలార్ యూనిట్లు ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించాలని జడ్పీచైర్మన్ వేణుగోపాలరావు అధికారులను కోరారు.

అంతర్ జిల్లా దొంగల ముఠా గుట్టురట్టు

● ఛేదించిన బిక్కవోలు పోలీసులు ● నలుగురు నిందితుల అరెస్టు
● రూ.41.50 లక్షల చోరీ సొత్తు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ భవ్యకిశోర్

బిక్కవోలు, మే 2(ఆంధ్రజ్యోతి): దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురు అంతర్ జిల్లాల దొంగల ముఠా గుట్టురట్టయ్యింది. బిక్కవోలు పోలీసులు కేసు ఛేదించి వారిని అరెస్టు చేయడంతోపాటు వారి నుంచి రూ.41.50 లక్షల విలువ గల చోరీ సొత్తును, నగదును స్వాధీనం చేసుకున్నారని రాజమహేంద్రవరం ఈస్ట్‌జోన్ ఇన్‌చార్జి డీఎస్పీ భవ్యకిషోర్ తెలిపారు. శుక్రవారం బిక్కవోలులో ఏర్పాటుచేసిన ప్రెస్‌మీట్‌లో ఆమె ఈ వివరాలను వెల్లడించారు. జల్సాలకు అలవాటుపడిన అనకాపల్లి జిల్లా మాకవరపు మండలానికి చెందిన దల్లి కామిరెడ్డి(తామవరం), వళ్ల శ్రీను(గిడుతూరు), కచ్చల చిరంజీవి(చినరాచపల్లి), సఖిలేటి సాయి(జంగాలపల్లి)కి చెందిన నలుగురు చిన్నప్పటి నుంచి స్నేహితులు. వీరు బైక్ మెకానిక్, లారీ డ్రైవర్, ఐరన్ షాపుల్లో పని చేస్తూ వచ్చిన డబ్బు జల్సాలకు సరిపోక దొంగతనాలకు అలవాటుపడ్డారు. దీంతో వీరు తూర్పుగోదావరి, కాకినాడ, అనకాపల్లి, ఏలూరు, శ్రీకాకుళం, విశాఖ జిల్లాల్లో ఇప్పటివరకూ 25చోరీలకు పాల్పడ్డారు. ఈయే డాది జనవరి 9న ఈనలుగురు గతంలో విశాఖపట్నంలో ఆనందపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో దొంగిలించిన బ్రిజా కారులో బిక్కవోలు మండలం బలభద్రపురం గ్రామం వచ్చి వరుసగా వెల్డింగ్ షాపులో గ్యాస్ సిలిండర్లు, గ్యాస్ కట్టర్లు దొంగిలించి గ్రాచీమంలోని ఇండియా ఏటీఎంను, స్థానిక జ్యూ యలరీ షాపులో దొంగతనానికి ప్రయత్నించి విఫలమవ్వడంతో తిరిగి వెళ్లిపోయారు. ఆపై వచ్చిన సమాచారం మేరకు నలుగురు నిందితుల్లో ఒకరైన సఖిలేటి సాయిని తుని రైల్వేస్టేషన్ వద్ద కొయ్యలగూడెంలో దొంగిలించిన మోటారు బైక్‌తో బిక్కవోలు పోలీసులు పట్టుకుని విచారించి రిమాండ్‌కు పంపారు. అయితే నిందితుల్లో మరొకరైన కచ్చల చిరంజీవిని పీటీ కేసులో మాకవరపుపాలెంలో అక్కడి పోలీసులు అరెస్టుచేసి రిమాండ్‌కు పంపారు. దీంతో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు డీఎస్పీ ఆధ్వర్యంలో అనపర్తి సీఐ, బిక్కవోలు ఎస్ఐలు చాకచక్యంగా పై కేసుల్లో ప్రధాన నిందితులైన దల్లి కామిరెడ్డి, వళ్ల శ్రీనులను గురువారం సాయంత్రం తుని రైల్వేస్టేషన్ వద్ద అరెస్టు చేసి వారి నుంచి రూ.41.50లక్షల విలువైన సొత్తు, 71 గ్రాముల బంగారు వస్తువులు, కిలో వెండి వస్తువులు, మూడు మో టారు సైకిళ్లు, ఒక కారు, జగనన్న కాలనీ ఇంటి పత్రాలు, గ్యాస్ కట్టర్లు, రూ.9.80 లక్షల నగదు) స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు పంపినట్లు డీఎస్పీ భవ్యకిషోర్ వివరించారు. ఈ కేసును ఛేదించిన అనపర్తి సీఐ సుమంత్, బిక్కవోలు ఎస్ఐ రవిచంద్రకుమార్, సిబ్బందిని జిల్లా ఎస్పీ ఈసందర్భంగా అభినందించారు.

చెన్నై ఎయిర్‌పోర్ట్ కస్టమ్స్ డిప్యూటీ కమిషనర్‌గా వినయ్



యానాం, మే 2 (ఆంధ్రజ్యోతి): యానాంకి చెందిన ఐఆర్ఎస్ అధికారి మల్లిపూడి వినయ్ చెన్నై ఎయిర్‌పోర్టు కస్టమ్స్ డిప్యూటీ కమిషనర్‌గా నియమితులయ్యారు. 2017 బ్యాచ్‌కు చెందిన వినయ్ చెన్నైలోని జీఎస్టీ ఇంటెలిజెన్స్ విభాగంలో ఆఫీసర్‌గా పనిచేశారు. ప్రస్తుతం వినయ్ చెన్నై ఎయిర్‌పోర్టులో కీలక బాధ్యతలు చేపట్టారు. స్మగ్లింగ్ నిరోధక చర్యలు, ప్రమాణికుల రాకపోకలు, నిషిద్ధవస్తువులు పట్టివేత, కస్టమ్ చట్టం అమలును పర్యవేక్షించడం వంటి బాధ్యతలు నిర్వహించనున్నారు.

గంజాయి కేసులో పదేళ్ల కఠిన కారాగార శిక్ష

రాజమహేంద్రవరం సిటీ, మే 2(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరిజిల్లా బొమ్మూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో 2017లో 266 కేజీల గంజాయిని లారీలో అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన నిందితుడు బొద్దిక సురేష్ నేరం రుజువు కావడంతో అతనికి పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తూ రాజమండ్రి 1వ అదనపు సెషన్స్‌కోర్టు న్యాయమూర్తి ఆర్.శివకుమార్ తీర్పును వెల్లడించారు. బొమ్మూరు పోలీసుల కథనం ప్రకారం వివరాల్లోకి వెళితే నర్సీపట్నం నుంచి వరంగల్‌కు లారీలో బొద్దిక సురేష్ గంజాయిని రవాణా చేస్తుండగా పోలీసులు అతన్ని చాకచక్యంగా పట్టుకున్నారు. అప్పట్లో బొమ్మూరు స్టేషన్‌లో బొద్దిక సురేష్‌పై క్రైమ్‌నెంబరు 375/2017లో సెక్షన్ 8(సి),20(బి)(2)(సి)ఆఫ్ ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద రెండో ముద్దాయిగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అప్పట్లో అతన్ని రిమాండ్‌పై సెంట్రల్ జైలుకు తరలించారు. ఈకేసు పూర్వాపరాలను న్యాయమూర్తి పరిశీలించారు. ప్రాసిక్యూషన్ తరపున వీపీ లక్ష్మణ్‌నాయక్ బలమైన వాదనలు వినిపించారు. తుది తీర్పును న్యాయమూర్తి వెల్లడించారు. ఈకేసులో అప్పటి దర్యాప్తు అధికారి కే.నాగమోహన్‌రెడ్డి, ప్రస్తుత సీఐ పి.కాశీవిశ్వనాధంలు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి నిందితుడికి శిక్షపడటానికి దోహదపడ్డారు.

దొంగతనంగా జామాయిల్ తోట నరికివేత

● బూరుగువాయి తండాలో కాంట్రాక్టర్‌కు విక్రయం

ఎటపాక, మే 2 (ఆంధ్రజ్యోతి): రైతులకు చెందిన జామాయిల్ తోటల్లో కొందరు దొంగలు పడి అర్ధరాత్రి జామాయిల్ కర్రలు(సైజులు) నరికి తీసుకెళ్లి, గుట్టుచప్పుడు కాకుండా విక్రయిస్తున్నారు. ఇటీవల అల్లూరిజిల్లా ఎటపాక మండలం, సీతాపురం, కుసుమనపల్లి గ్రామాల్లో ఈ జామాయిల్ పంట(కర్రల) దొంగతనాలు అధికమయ్యాయి. మూడురోజుల క్రితం సీతాపురం గ్రామానికి చెందిన వల్లభనేని విష్ణుమూర్తి జామాయిల్ తోటలోని సుమారు 6టన్నుల జామాయిల్ పంటను నరికి ఎత్తుకెళ్లారు. దొంగతనంగా తోటల్లో నరికిన పంటను బూరుగువాయి తండాలో ఓ జామాయిల్ కాంట్రాక్టర్ కొనుగోలు చేస్తున్నట్టు రైతులు పేర్కొంటున్నారు. ఆగ్రామంలో వేబ్రిడ్జి ఏర్పాటుచేసి, పగలు రాత్రి తేడా లేకుండా కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది. దొంగతనంగా జామాయిల్ కర్రల లోడును తరలిస్తున్న ట్రాక్టర్‌ను కొందరు రైతులు సీసీ కెమెరాల్లో గుర్తించారు. ఆ ట్రాక్టర్ కుసుమనపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తిగా ప్రచారం సాగుతోంది. కొందరు వ్యక్తులు ఇటీవల ముఠాగా ఏర్పడి, జామాయిల్ తోటలను నరికి, దొంగతనంగా విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. పోలీసులు జమాయిల్ తోటల నరికివేత దొంగలను పట్టుకోవాలని రైతులు కోరుతున్నారు. రైతు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

మ్యాట్రిమోనిలో పరిచయమై

దోషాల పేరుతో బంగారు వస్తువుల దోపిడీ

రాజమహేంద్రవరంసిటీ, మే2 (ఆంధ్రజ్యోతి): పితృదోషం పూజలు పేరులో ఒంటరి మహిళను గుర్తుతెలియని వ్యక్తి మోసంచేసి బంగారం, వెండి వస్తువులతో ఉడాయించాడని త్రీటౌన్ పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం వివరాల్లోకి వెళితే నెల్లూరుకి చెందిన జి.నాగభారతి అనే 30ఏళ్ల తన భర్తతో విడాకులు తీసుకుని ఒంటరిగా ఉంటుంది. రెండో వివాహం కోసం ప్రయత్నం చేస్తున్న క్రమంలో మెట్రిమోనిలో రాజమహేంద్రవరానికి చెందిన ఒక వ్యక్తి పరిచయం అయ్యాడు. అతను నీకు నాకు పితృదోషాలు ఉన్నాయని రాజమహేంద్రవరంవస్తే కోటిలింగాల రేవులో పూజలుచేసి పరిహారం చెల్లిస్తే దోషాలు పోతాయని చెప్పడంతో ఆ గుర్తుతెలియని వ్యక్తి మాటలు నమ్మిన భారతి గతనెల 20న రాజమహేంద్రవరం వచ్చింది. దీంతో ఆమెను రిసీవ్ చేసుకున్న సదరు గుర్తుతెలియని వ్యక్తి ఆమెను కోటిలింగాల రేవుకు తీసుకువెళ్లి పితృదోషాల పూజలు చేయించడానికి సిద్ధం చేసి ఆమెను ఒంటిమీద ఉన్న బంగారం, వెండి వస్తువులను తీసి స్నానం చేసి రమ్మని చెప్పాడు. దీంతో ఆమె వాటిని తీసి అతనికి ఇచ్చి స్నానానికి వెళ్లి తిరిగి వచ్చేసరికి వస్తువులతో సదరు వ్యక్తి అదృశ్యమయ్యాడు. దీంతో ఆమె ఖంగుతిని గత పదిరోజులుగా రాజమహేంద్రవరంలో ఆ వ్యక్తి కోసం వెతికి చివరికి శుక్రవారం త్రీటౌన్ పోలీసులను ఆశ్రయించింది. సదరు వ్యక్తి పేరు కూడా ఆమెకు తెలియదని అతని ఫొటో వుందని తన ఫిర్యాదులో పేర్కొంది. మొత్తం 34 గ్రాముల బంగారు అభరణాలు, 26 తులాల వెండి పట్టీలు అపహరించుకుపోయాడని ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ కేసులో నిందితుడికి ఏడాది జైలు

కాకినాడ క్రైం, మే 2 (ఆంధ్రజ్యోతి): ఓ దుకాణంలో చోరీ కేసులో పట్టుబడ్డ నిందితుడికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. కాకినాడ జిల్లా కాకినాడ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పద్మనాభనగర్ అన్నమ్మ ఘాటీ సెంటర్‌కు చెందిన వెలుగుబంటి వీరబాబు ఏప్రిల్ ఒకటో తేదీ అర్ధరాత్రి పులవర్తివారి వీధిలో గల మహీంద్రా స్వీట్‌స్టాల్‌లో చోరీకి పాల్పడ్డాడు. ఈ కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. ఈ కేసులో వాదోపవాదనలు ముగిసిన తర్వాత నేరం రుజువు కావడంతో నిందితుడికి ఏడాది సాధారణ జైలుశిక్ష విధిస్తూ మూడో అదనపు జూనియర్ సివిల్ జడ్జి డి.శ్రీదేవి తీర్పు నిచ్చినట్లు సీఐ ఎం.నాగదుర్గారావు తెలిపారు.

ప్రమాద బీమా పరిహారం జమ

యానాం, మే2(ఆంధ్రజ్యోతి): కురసాంపేట గ్రామానికి చెందిన పాలెపు రామరావు భార్య దుర్గాభవాని 4నెలల క్రితం ఇంటివద్ద చీరకు నిప్పు అంటుకుని మృతిచెందింది. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజనపథకంలో ప్రమాద బీమా కింద రూ.5లక్షలు బ్యాంకు ఖాతాలో జమ అయినట్టు మత్స్యశాఖ సహాయ సంచాలకుడు తెలిపారు.

కిశోర బాలికలకు అవగాహన

మామిడికుదురు, మే 2(ఆంధ్రజ్యోతి): కిశోరి వికాసం కార్యక్రమం నగరం, పెదపట్నంలంక, పాశర్లపూడిలంక, పెదపట్నంలంక గ్రామాల్లో శుక్రవారం జరిగింది. నగరంలో జరిగిన కార్యక్రమంలో బాలికల్లో వయసురీత్యా శరీరంలో వచ్చే మార్పులు, ఆరోగ్యపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను సర్పంచ్ జాలెం రమణకుమారి వివరించారు.

గ్రామాల్లో రోజురోజుకూ పెరుగుతున్న తాగునీటి ఇక్కట్లు

విసిగి వేసారి రోడ్డెక్కిన మహిళలు



సన్నవిల్లి పెద్దచెరువుపేటలో వారం రోజులుగా తాగునీరు లేదంటూ ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

ఉప్పలగుప్తం, మే 2(ఆంధ్రజ్యోతి): చల్లపల్లి ఆర్‌డబ్ల్యూఎస్ ప్రాజెక్టు పరిధిలోని గ్రామాల్లో రోజురోజుకూ పెరుగుతున్న తాగునీటి ఇక్కట్లతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎంపీడీవో కార్యాలయానికి వివిధ గ్రామాల నుంచి తాగునీరిప్పించండంటూ వినతులు వస్తున్నాయి. సోషల్ మీడియా ద్వారా తమ ఇబ్బందులను జనం ఏకరవు పెడుతున్నారు. ప్రతి రోజూ 15,10,000లీటర్ల తాగునీరు సరఫరా చేస్తున్నామని అధికారులు చెబుతుంటే, నీటి కొరతకు కారణమేంటో ఆంధ్రజ్యోతి పలు కథనాల ద్వారా లోపాలను బహిర్గతం చేసింది. అయినా సంబంధిత అధికారుల్లో చలనం లేదు. పది రోజులుగా నీటి సరఫరాలో తరచూ అంతరాయాలు ఏర్పడం సాధారణంగా మారింది. ఫలితంగా గ్రామాల్లో మహిళలు పంచాయతీ కార్యాలయాలకు వెళ్లి ఆరాతీస్తున్నారు. ప్రాజెక్టు నుంచి నీరు పూర్తిగా పంపింగ్ జరగడం లేదని సర్పంచ్‌లు చెప్పడంతో ఆగ్రహించిన మహిళలు వీధుల్లోకి వచ్చి ఆందోళనకు దిగారు. శుక్రవారం సన్నవిల్లి పంచాయతీ పెద్దచెరువుపేటతో పాటు పేరాయి చెరువు, దేవీనగర్, ఆదిలక్ష్మీపురం, గొల్లవిల్లి ఎన్టీఆర్ కాలనీ తదితర ప్రాంతాల్లో తాగునీటి కోసం ఆందోళనకు దిగారు. గంట పాటు వచ్చే తాగునీరు పది రోజులుగా 20నిమిషాలు కూడా రావడం లేదని సన్నవిల్లి ఎంపీటీసీ వంగా గిరిజానాగకుమారి ఆందోళన వ్యక్తంచేశారు. పెద్దచెరువుపేటలో జరిగిన ఆందోళనలో ఆమె పాల్గొన్నారు. పంచాయతీ ట్యాంకులకు పూర్తి స్థాయిలో నీరు పంపింగ్ చేయడంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు విఫలమవుతున్నారని ఆమె ఆరోపించారు. బుధవారం ప్రధాన పైప్‌లైన్‌లో అంతరాయం వల్ల గురువారం తాగునీటి సరఫరా జరగలేదు. శుక్రవారం సైతం అరకొరగానే కొన్ని గ్రామాలకు మాత్రమే నీటి సరఫరా జరగడంతో మహిళలు ఆందోళనకు దిగారు. పూర్తిస్థాయిలో తాగునీరందించాలంటూ నినాదాలు చేశారు.

శిథిలావస్థలో తహశీల్దారు కార్యాలయం

- ఇరుకు గదుల్లో విధులు..
- ఉద్యోగుల ఇబ్బందులు
- 2018లో నూతన భవనానికి శంకుస్థాపన
- నిలిచిన నిర్మాణం





శిథిలావస్థకు చేరిన తహశీల్దార్ కార్యాలయం, మధ్య నిలిచిపోయిన కార్యాలయం

అంబాజీపేట, మే 2(ఆంధ్రజ్యోతి): ఇరుకు గదుల్లో రెవెన్యూ ఉద్యోగులు విధులు నిర్వహిస్తూ నానా ఇబ్బందులు పడుతున్నారు. అంబాజీపేట తహశీల్దారు కార్యాలయంలో తహశీల్దారుతో పాటు డిప్యూటీ తహశీల్దారు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్లు విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న అంబాజీపేట తహశీల్దారు కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. చిన్నపాటి వర్షానికి శ్లాబు లీకేజీ అవ్వడంతో కార్యాలయంలోని రికార్డులు, కంప్యూటర్లు తడిచిపోయి ఉద్యోగులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈకార్యాలయంలో తహశీల్దార్ కోసం ఒక గది, ఉద్యోగులు విధులు నిర్వహించడానికి ఒక హాల్ ఉంది. తహశీల్దార్ కూర్చునే చిన్న ఇరుకు గదిలోనే ఉద్యోగులు, రైతులు, పార్టీల నాయకులతో తహశీల్దార్ సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈకార్యాలయంలో ఉన్న మరో ఒక చిన్న హాల్‌లోనే ఉద్యోగులంతా విధులు నిర్వహించడానికి నానా ఇబ్బందులు పడుతున్నారు. 2018లో అప్పటి టీడీపీ హయాంలో స్థానిక విద్యుత్ కార్యాలయం సమీపంలోని ఖాళీ స్థలంలో తహశీల్దారు కార్యాలయం భవన నిర్మాణానికి రూ.90లక్షలు మంజూరు చేశారు. అప్పటి ప్రభుత్వంలో శ్లాబ్ వరకూ నిర్మాణం జరిగింది. అయితే వైసీపీ ప్రభుత్వంలో ఒక్క రూపాయి నిధులు కూడా మంజూరు చేయలేదు. ఈభవనాన్ని పూర్తిచేయాలని గతంలో పనిచేసిన తహశీల్దారు అనేకసార్లు కలెక్టర్‌తో పాటు ప్రజాప్రతినిధులకు ప్రతిపాదనలు పంపించినప్పటికి పట్టించుకోలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి తహశీల్దారు కార్యాలయం భవనాన్ని పూర్తిస్థాయిలో నిర్మించడానికి చర్యలు తీసుకోవాలని రెవెన్యూ ఉద్యోగులు, ప్రజలుకోరుతున్నారు.

సమస్యల పరిష్కారానికి మోకాళ్లపై నిరసన



కలెక్టరేట్ ఎదుట మోకాళ్లపై కూర్చుని నిరసన వ్యక్తం చేస్తున్న ఆయుష్మాన్ భారత్ ఉద్యోగులు

అమలాపురం టౌన్, మే 2 (ఆంధ్రజ్యోతి): ఆయుష్మాన్ భారత్‌లో పనిచేస్తోన్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కలెక్టరేట్ ఎదుట వారు మోకాళ్లపై కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఆయుష్మాన్ భారత్ ఉద్యోగులు సమస్యలు పరిష్కరించాలంటూ శుక్రవారం పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఆరేళ్లుగా పనిచేస్తోన్న ఉద్యోగ భద్రత లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్‌హెచ్ఎం ఉద్యోగులతో సమానంగా వేతన సవరణ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ప్లకార్డులు చేతబూని నిరసన వ్యక్తం చేశారు. యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.సాయిశంకర్, జిల్లా కార్యదర్శి కె.సాయితేజ, బి.శివ, పి.మనోహర్, జల్లి వెంకటేశ్, హిమజ, టి.రంగారావు, రాజీవ్, సుమంత్ తదితరులు పాల్గొన్నారు. ఆయుష్మాన్ భారత్ ఉద్యోగులకు ఆర్‌సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఎం.నాగమణి, ఎఫ్ఎస్‌టీయూ నాయకుడు కేవీ రెడ్డి తదితరులు సంఘీభావం తెలిపారు.

టీడీపీ సభ్యత్వ కార్డుల అందజేత

రాజోలు, మే 2 (ఆంధ్రజ్యోతి): తాటిపాకలో టీడీపీ కార్యకర్తలకు సభ్యత్వ కార్డులను శుక్రవారం ఎంపీపీ కేతా శ్రీను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకువెళుతున్నారని అన్నారు. అమరావతి, పోలవరం పనులను ముందుకు తీసుకువెళ్తున్నారన్నారు. పేదల కోసం సీఎం చంద్రబాబు అనేక పథకాలు ప్రవేశపెట్టారన్నారు. విద్యాశాఖ మంత్రిగా లోకేశ్ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి విద్యాభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సారిక ఆంజనేయులు పాల్గొన్నారు.

అనుమతులు ముగిసినా ఆగని తవ్వకాలు

మానేపల్లిలో మైన్స్ అధికారుల తనిఖీలు

పి.గన్నవరం, మే 2(ఆంధ్రజ్యోతి): మానేపల్లి గ్రామపరిధిలో ప్రైవేటు, ప్రభుత్వ భూముల్లో తువ్వమట్టిని తీసుకునేందుకు ఏప్రిల్ పదో తేదీ వరకు తాత్కాలిక అనుమతులు తీసుకున్నారు. గడువు ముగిసినప్పటికి తవ్వకాలు మాత్రం ఆగలేదు. స్థానికుల ఫిర్యాదుతో తువ్వమట్టి ర్యాంపులో శుక్రవారం మైన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. గోదావరి నది తీరాన ఉన్న రెండు ఎక్స్‌కవేటర్లను స్వాధీనం చేసుకున్నారు. వాటిని స్థానిక రెవెన్యూ సిబ్బందికి అప్పగించారు. మైన్స్ ఆర్ఐ వి.సుజాత, టెక్నికల్ అసిస్టెంట్ రెహమాన్‌ఆలీ, వీఆర్వో నాగన్న పాల్గొన్నారు.

ఆనందరావు దంపతులకు సన్మానం

పి.గన్నవరం మే 2(ఆంధ్రజ్యోతి): పోతవరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎంగా ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన కత్తుల ఆనందరావు దంపతులను పాఠశాల కమిటీ సమక్షంలో శుక్రవారం అభినందన సభ నిర్వహించి ఘనంగా సన్మానించారు. ఆనందరావు చేసిన సేవలను వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో కోనసీమ సైన్స్ పరిషత్ అధ్యక్షుడు సీవీ సర్వేశ్వరశర్మ, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పి.దొరబాబు, ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ పల్లంరాజు, ఎస్సీ వెల్ఫేర్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.బంగార్రాజు, గ్రామ సర్పంచ్ వడలి కొండయ్య, ఎంపీటీసీ పులపర్తి రాజారావు, ఎస్ఎంసీ చైర్మన్ కోట రామకృష్ణ, ప్రధానోపాధ్యాయుడు బీసీహెచ్ మల్లికార్జునరావు, ముంగండ కాంప్లెక్సు జాయింట్ సెక్రటరీ నల్లా నారాయణస్వామి పాల్గొన్నారు.

'కిమ్స్'లో వెంకన్న బ్రహ్మోత్సవాలు ప్రారంభం



వేంకటేశ్వరాలయాన్ని సందర్శించిన మాడుగుల నాగఫణిశర్మతో కిమ్స్ చైర్మన్ చైతన్యరాజు తదితరులు

అమలాపురం, మే 2 (ఆంధ్రజ్యోతి): అమలాపురంలోని కిమ్స్ మెడికల్ కళాశాల ఆవరణలో గల శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయంలో దశమ వార్షికోత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో మూడు రోజుల పాటు జరగనున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటి రోజు ఉదయం సంకల్పం, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనంతో ఘనంగా ప్రారంభమయ్యాయి. కిమ్స్ ఎండీ కె.రవికిరణ్‌వర్మ-శేషపవిత్ర దంపతులు దీక్షాధారణ చేశారు. స్వామివారిని పెండ్లి కుమారుడిని చేసి అర్చనల్లో పాల్గొన్నారు. సాయంత్రం అకురార్పణ, వాస్తుహోమం, ధ్వజావరోహణ కార్యక్రమాలను అర్చకులు నిర్వహించారు. సాయంత్రం 5గంటలకు పద్మశ్రీ పురస్కార గ్రహీత అవధాన బ్రహ్మశ్రీ డాక్టర్ మాడుగుల నాగఫణిశర్మ ఆధ్యాత్మిక ప్రవచనాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. నాగఫణిశర్మను కిమ్స్ సంస్థల చైర్మన్ కేవీవీ సత్యనారాయణరాజు-బదరీలక్ష్మి దంపతులు, రవికిరణ్‌వర్మ-శేషపవిత్ర దంపతులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మెట్ల రమణబాబు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, డాక్టర్ గొలకోటి రంగారావు, బొర్రా ఈశ్వరరావు, రఘు తదితరులు పాల్గొని నాగఫణిశర్మ ప్రవచనాలను వీక్షించారు.

పదో తరగతి విద్యార్థులకు సన్మానం

మామిడికుదురు, మే 2(ఆంధ్రజ్యోతి): పదిలో ప్రతిభ కనబరిచి అత్యధిక మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అభినందన కార్యక్రమం మామిడికుదురు విద్యా వనరుల కేంద్రం వద్ద శుక్రవారం జరిగింది. మొగలికుదురు ఉన్నత పాఠశాల నుంచి కె.మహాలక్ష్మి 586, కె.శ్రీకళ 586 మార్కులతో మండలంలో మొదటి స్థానాన్ని, మామిడికుదురు హైస్కూలులో కె.జెహరా 576 మార్కులతో ద్వితీయస్థానం, లూటుకుర్రు హైస్కూలు నుంచి బోనం సత్యమౌలిక్య 574మార్కులతో తృతీయ స్థానం సాధించినట్టు ఎంఈవోలు ఎస్‌వీవీఎస్ లక్ష్మీనారాయణ, మోకా వెంకన్నబాబు తెలిపారు. విద్యార్థినులను దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సీహెచ్ నిరంజని, పితాని చక్రవర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అమరావతి సభకు తరలిన నాయకులు



అమరావతికి వెళుతున్న వారికి జెండా ఊపి ప్రారంభిస్తున్న నగర పంచాయతీ కమిషనర్ రవివర్మ తదితరులు

ముమ్మిడివరం, మే 2 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి పనుల పునః ప్రారంభం సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ పాల్గొనే బహిరంగ సభకు ముమ్మిడివరం నుంచి అధిక సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, నాయకులు, డ్వాక్రా మహిళలు తరలివెళ్లారు. ముమ్మిడివరం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, గుత్తుల సాయి, తాడి నరసింహారావు, యాళ్ల ఉదయ్, టేకుమూడి లక్ష్మణరావు, మందాల గంగసూర్యనారాయణ, మట్టా బాలసుబ్రహ్మణ్యేశ్వరరావు ఆధ్వర్యంలో 12 బస్సులు, చిన్నకార్లు తదితర వాహనాలపై అధిక సంఖ్యలో తరలివెళ్లారు. ముమ్మిడివరం నగర పంచాయతీ కార్యాలయం వద్ద స్వయం సహాయక శక్తిసంఘాల సభ్యులు, ఆర్పీలు, ఏఎన్ఎంలు, మహిళా పోలీసులు తరలివెళుతున్న బస్సులను కమిషనర్ పి.రవివర్మ, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్ జెండా ఊపి ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో నగర పంచాయతీ ఇంజనీర్ పీవీ సుధాకర్, హెల్త్ అసిస్టెంట్ జేఎస్ఎన్ రాజు, పీఎస్ఎం భాస్కర్, పీవో రాజేశ్వరి, నగర పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భూమిపై నడయాడిన దైవం రామానుజులు

అమలాపురం టౌన్, మే 2 (ఆంధ్రజ్యోతి): 120ఏళ్ల పాటు భూమిపై నడయాడిన దైవంగా రామానుచార్యులు కొనియాడబడ్డారని రామానుజదాసుడు వరదా సూరిబాబు పేర్కొన్నారు. రామానుజుల 1008వ తిరుమ నక్షత్రం (జన్మదినోత్సవం) పురస్కరించుకుని శుక్రవారం అమలాపురం శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి వైశ్య సంఘం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో స్వామివారి చిత్రపటానికి పూలమాలలువేసి సేవలు నిర్వహించారు. గురువు వద్ద అష్టాక్షరీ మహామంత్రాన్ని పొందిన రామానుజులు ఆ మంత్రాన్ని సామాన్య ప్రజలకు అందించారన్నారు. కార్యక్రమంలో వైశ్య సంఘం అధ్యక్షుడు నంబూరి సత్యనారాయణమూర్తి, కార్యదర్శి నంబూరి నరేష్, కోశాధికారి కొమ్మూరి ప్రసాద్, ఉత్సవ కమిటీ చైర్మన్ అప్పన వీరన్న, కోచైర్మన్ నూలు శ్రీనివాస్, నూలు కృష్ణ, మండవిల్లి నాగేశ్వరరావు, మహిళా విభాగ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉత్సవమూర్తుల ప్రదక్షిణ

మామిడికుదురు, మే 2 (ఆంధ్రజ్యోతి): జగద్గురు శ్రీమాన్ రామానుజాచార్యుల 1008 జయంతిని బాలబాలాజీ దేవస్థానంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఉత్సవమూర్తులను పల్లకీలో చేర్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణ నిర్వహించారు. అనంతరం విశేషార్చన, అష్టోత్తర నామార్చన, తీర్థ ప్రసాదగోష్ఠి తదితర పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా ఘనంగా జరిపారు. ఆలయ సహాయ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో ఆయా కార్యక్రమాలు జరిగాయి. ఈపూజా కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

శంకరాచార్యుల జయంత్యుత్సవాలు

ఐ.పోలవరం, మే 2(ఆంధ్రజ్యోతి): మురమళ్ళ వీరేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ఆదిశంకరాచార్య జయంత్యుత్సవాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, పురోహితులు, వేదపండితుల ఆధ్వర్యంలో ఈకార్యక్రమం జరిగింది. శంకరాచార్య చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సహాయ కమీషనర్ మాచిరాజు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తిరునక్షత్ర పూజలు



స్వామివారి ఆలయంలో తిరునక్షత్ర పూజలు చేస్తున్న అర్చకులు

అంతర్వేది, మే 2 (ఆంధ్రజ్యోతి): నవ నారసింహ క్షేత్రాల్లో ఒకటైన శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయంలో శుక్రవారం విశిష్టద్వైత మత స్థాపకులైన శ్రీభాగవత రామానుజుల 1008 జయంతి, తిరునక్షత్రాన్ని పురస్కరించుకుని అర్చకులు విశేష పూజలు ఘనంగా నిర్వహించారు. మూడు రోజుల జరిగిన పూజా కార్యక్రమాల్లో స్వామి-అమ్మవార్లను ప్రత్యేక సింహాసనంపై ఆశీనులుచేసి అలంకరించారు. దివ్య ప్రబంధ సేవా కాలం నిర్వహించి శ్రీభాగవత రామానుజులవారి జయంత్యుత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించినట్టు ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు.

అన్ని రకాల మందులు విక్రయించాలి

అంబాజీపేట, మే 2(ఆంధ్రజ్యోతి): మెడికల్ షాపుల్లో అన్ని రకాల మందులు విక్రయించేలా చర్యలు తీసుకోవాలని రాజమహేంద్రవరం డ్రగ్ కంట్రోలర్ సూపరింటెండెంట్‌ను శుక్రవారం కోకోఫెడ్ చైర్మన్ అరిగెల బలరామమూర్తి కోరారు. క్రోనోట్రిల్ కోజీఫామ్ వంటి మందులు కార్డియాలజీ డాక్టర్లు సిఫార్సు చేస్తారని, సంవత్సరాలుగా వాడుతున్న ఈమందులు ఒక్కసారిగా మానివేయడం వల్ల నిద్రకరువై అనారోగ్యం బారిన పడుతున్నారని ఆయనకు వివరించారు. డాక్టర్ల చీటీపై సదరు నిద్రమాత్రలు ఇచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇత్తడి దీపపు కుందుల బహూకరణ



ఆత్రేయపురం, మే 2(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామికి శుక్రవారం అమలాపురానికి చెందిన కరాటం సూరిబాబు-భానుమణి దంపతులు 14.5 కేజీల ఇత్తడి దీపపు కుందులను సమర్పించారు. తొలుత వారు స్వామిని దర్శించుకున్నారు.

కనీస వేతనం అమలుచేయాలని తల్లీ బిడ్డా ఎక్స్‌ప్రెస్ ఉద్యోగుల ధర్నా



డీఆర్వోకు వినతిపత్రం అందజేస్తున్న తల్లీబిడ్డా ఎక్స్‌ప్రెస్ కెప్టెన్లు

అమలాపురం టౌన్, మే 2(ఆంధ్రజ్యోతి): తల్లీబిడ్డా ఎక్స్‌ప్రెస్‌లో పనిచేస్తోన్న కెప్టెన్లు (డ్రైవర్లకు) కనీస వేతనం అమలు చేయడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలన్న ప్రధాన డిమాండ్‌తో శుక్రవారం కలెక్టరేట్ ఎదుట వారు ధర్నా నిర్వహించారు. వైద్య ఆరోగ్య శాఖకు సేవలు అందిస్తున్న తమకు ఏడేళ్లుగా రూ.8,800 చొప్పున మాత్రమే యాజమాన్యం చెల్లిస్తుందని, చివరకు యాజమాన్యం కట్టాల్సిన పీఎఫ్ వాటాను ఉద్యోగుల నుంచే మినహాయిస్తున్నారని ఆరోపించారు. ఒకరోజు వేతనంతో కూడిన సెలవు, పండుగ సెలవులు అమలు చేయడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించాలని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, డ్రైవర్లందరికీ ప్రమాద బీమా వర్తింప చేయాలన్నారు. ఈనెల20లోపు సమస్యలు పరిష్కరించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గుదే దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో జిల్లా రెవెన్యూ అధికారి బీఎల్ఎన్ రాజకుమారికి వినతిపత్రం అందజేశారు.

'విప్రో'కు 25మంది ఎంపిక

అమలాపురం రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): ఈదరపల్లిలోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో విప్రో కంపెనీ ప్రాంగణ ఎంపికలు నిర్వహించింది. కళాశాలకు చెందిన 25మంది ఉద్యోగాలు సాధించినట్టు కళాశాల డైరెక్టర్ పీఎస్‌వీఎస్ చలపతిరావు తెలిపారు. ఒక్కొక్కరికీ రూ.2.50లక్షల వార్షిక వేతనంతో పాటు ప్రతిష్ఠాత్మకమైన బిట్స్ పిలానీలో ఉచితంగా ఎంటెక్ చదువుకునే అవకాశం లభిస్తుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ఉద్యోగంతో పాటు ఉన్నతమైన విద్య అభ్యసించే అవకాశం రావడం శుభ పరిణామమన్నారు. విప్రో కంపెనీ ఉద్యోగులకు ఎంపికైన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ సుబ్బారెడ్డి, ప్లేస్‌మెంట్ అధికారి సూర్యచంద్ర, అధ్యాపకులు అభినందించారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

అమలాపురం రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో బండారులంక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని సర్పంచ్ పెనుమాల సునీత ప్రారంభించారు. కంటి ఆసుపత్రి వైద్య ప్రతినిధులు జి.నగేష్, పి.వినోద్, ఎం.వెంకటేష్, ఎస్.విజయ్‌ల ఆధ్వర్యంలో సిబ్బంది 350 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 20మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో శ్రీశైలం దేవస్థానం మాజీ ట్రస్టీ చింతా శంకరమూర్తి, నాయకులు పిచ్చిక శ్యామ్, ఆశపు చిన్నీ, కొల్లి అంబేడ్కర్, కొండా రాజు, కాశిన బాబి, కార్యదర్శి కోరుమిల్లి శ్రీనివాసరావుపాల్గొన్నారు.

భవన నిర్మాణ అనుమతుల మంజూరుకు వెసులుబాటు

ముమ్మిడివరం, మే 2 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని ప్రజలు భవన నిర్మాణ అనుమతులు మంజూరు సులభతరంగా పొందేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించిందని నగర పంచాయతీ కమిషనర్ పి.రవివర్మ పేర్కొన్నారు. ప్రజలు లైసెన్సు టెక్నికల్ పర్సన్లు, సర్వేయర్లు, ఇంజనీర్ల ద్వారా గ్రామ కంఠం అధికార లేఅవుట్లు సర్క్యులేషన్ ప్యాట్రన్ తదితర ప్రాంతాల్లో నివాసం కోసం భవన నిర్మాణ అనుమతులకు స్వీయ ధ్రువీకరణ పత్రం సమర్పించి వేగంగా అత్యంత పారదర్శకంగా అనుమతులు పొందవచ్చునన్నారు. దీనికి సంబంధించి నగర పంచాయతీ, టౌన్ ప్లానింగ్ విభాగంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశాన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం అందజేత

ముమ్మిడివరం, మే 2(ఆంధ్రజ్యోతి): ఠాణేలంక పంచాయతీ పరిధిలోని బలుసుల్లంక గ్రామంలో అగ్ని ప్రమాదంలో ఇల్లు కోల్పోయిన చిన్నం ప్రసాద్ కుటుంబానికి పీపుల్ సర్వీస్ ఆర్గనైజేషన్ రూ.5వేలు, నిత్యావసరాలు, వంట సామగ్రిని సమకూర్చగా వాటినిఎంపీడీవో తాడి శ్రీవెంకటాచారి, ఓఎన్జీసీ ఎస్సీ, ఎస్టీ కార్యదర్శి రవీంద్ర నునావత్ అందజేశారు. పీపుల్ సర్వీస్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు కన్నిడి వెంకటేశ్వరరావు, నక్కా శివకుమార్, చిన్నం రాంబాబు, సీహెచ్ శ్రీనివాసరావు, జీవీ సత్యనారాయణ, కేబీవీ కిశోర్, సీహెచ్ వెంకటసుధీర్, రాంజీ, అరుణ్‌కుమార్, బి.శరత్‌కుమార్‌పాల్గొన్నారు.

సోమాలమ్మ తల్లి జాతర మహోత్సవాలు

ఉప్పలగుప్తం, మే 2(ఆంధ్రజ్యోతి): ఉప్పలగుప్తంలో గ్రామదేవత సోమాలమ్మతల్లి జాతర మహోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈనెల 6వరకు జాతర ఉత్సవాలు జరుగుతాయని ఉత్సవ కమిటీ తెలిపింది. శుక్రవారం నాగులపల్లి పాపయ్యరాజు, శాంతికుమారి నిర్వహణలో భైరవబొట్ల వెంకటసుబ్రహ్మణ్యం బ్రహ్మత్వంలో కుంకుమ పూజలు జరిగాయి. నాగులపల్లి పాపయ్యరాజు ఆధ్వర్యంలో అన్నసమారాధన జరిగింది. ఈనెల 5న జాతర, 6న అమ్మవారి తీర్థం జరుగుతుందని కమిటీ తెలిపింది.

రాజోలు ఇన్‌చార్జి ఎంపీడీవోగా వెంకటేశ్వరరావు

రాజోలు, మే 2(ఆంధ్రజ్యోతి): రాజోలు మండల పరిషత్ ఇన్‌చార్జి అధికారిగా కె.వెంకటేశ్వరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన డి.రాంబాబు నెల్లూరు జిల్లా కందుకూరు డీఎల్డీవోగా పదోన్నతిపై బదిలీపై వెళ్లారు. మామిడికుదురు ఎంపీడీవోగా పనిచేస్తోన్న వెంకటేశ్వరరావు బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఆయనకు ఏవో ఎంవీవీ సత్యనారాయణ, చక్రవర్తి, సిబ్బంది అభినందనలు తెలిపారు.

రూ.5కోట్లతో రోడ్లకు ప్రతిపాదనలు

మలికిపురం, మే 2(ఆంధ్రజ్యోతి): రాజోలు నియోజకవర్గంలోని అప్పనరామునిలంకలో రూ.5కోట్లతో ఆర్‌అండ్‌బీ రోడ్లకు ప్రతిపాదనలు పంపినట్టు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ తెలిపారు. ప్రతీ ఏటా వరదల సమయంలో అప్పనరామునిలంకలోని ఏడు కిలోమీటర్ల మేర వరదలో మునిగిపోవడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందన్నారు. ఈరోడ్డును ఎత్తుచేయడానికి రూ.5.25కోట్లతో ప్రతిపాదనలు సీఎంకు అందజేశాననిఎమ్మెల్యే తెలిపారు.

ఎండు గడ్డి దగ్ధం

అంబాజీపేట, మే 2(ఆంధ్రజ్యోతి): గంగలకుర్రు అగ్రహారం ఇందిరానగర్‌లో నిప్పు రాజుకుని మూడు ఎకరాల గడ్డి దగ్ధమైంది. దిగుమర్తి బాలరాజు రూ.25వేలతో మూడు ఎకరాల గడ్డిని కొనుగోలు చేసి ఇంటి వద్ద భద్రపరుచుకున్నాడు. గుర్తుతెలియని వ్యక్తి సిగరెట్టు కాల్చిపాడేయడంతో గడ్డికి నిప్పు కుంటుంది. అమలాపురం అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపుచేశారు.

గ్రీన్ కవరేజ్‌తో సూక్ష్మజీవుల అభివృద్ధి

రాజోలు, మే 2(ఆంధ్రజ్యోతి): ప్రతీ రైతు భూమి వేసవి తాపానికి గురికాకుండా పచ్చని గ్రీన్ కవరేజ్ ఉండేలా చేయడం వల్ల సూక్ష్మజీవులు అభివృద్ధి చెందుతాయని రాజోలు మండల వ్యవసాయశాఖ అధికారి మధుబాబు తెలిపారు. తాటిపాక యూనిట్ తాటిపాకలో ప్రకృతి వ్యవసాయ ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ 2025-26లో భాగంగా రెండో దఫా పీఎండీఎస్ కిట్స్ మహిళా సంఘాలతో కలిసి అంబేడ్కర్ ఎలిమెంటరీ స్కూలు ఆవరణలో 18రకాల విత్తనాలతో పీఎండీఎస్ కిట్స్ రిపేర్‌చేసి డ్వాక్రా సంఘాల సభ్యులకు వివరించారు. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో పొదలాడ నీటిసంఘం అధ్యక్షుడు ఉలిశెట్టి లక్ష్మణరావు, వడ్లమూడి ప్రకాశరావు, ఎంటీ జోసెఫ్, తాటిపాక యూనిట్ ఇన్‌చార్జి పి.ప్రసన్నకుమార్, ఐసీఆర్పీలు శ్రీదేవి, గౌరీ, దుర్గాభవానీ, గంగాభవానీ, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.


రేపు యానాంలో నీట్ పరీక్ష

యానాం, మే 2(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఉన్న మెడికల్ కళాశాలల్లో వైద్య వృత్తిలో ప్రవేశం కోసం ఆదివారం నిర్వహించనున్న నీట్ ప్రవేశపరీక్షకు యానాం విద్యార్థుల కోసం యానాం జవహర్ నవోదయ విద్యాలయాన్ని కేంద్రంగా కేటాయించారు. ఈపరీక్షకు యానాంలో 134మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారు. ఉదయం 11నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు విద్యార్థులు పరీక్షా కేంద్రంలోకి అనుమతి ఇస్తారు. ఆ తర్వాత ఒక నిమిషం ఆలస్యమైనా అనుమతించేది లేదన్నారు. మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్ష జరగనుందన్నారు. విద్యార్థులు అడ్మిట్ కార్డుతో పాటు రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ఫొటోతో కూడిన గుర్తింపుకార్డు తీసుకురావాలన్నారు. నీట్ నిబంధనలకు అనుగునంగా డ్రెస్‌కోడ్‌ను ధరించాలన్నారు. యానాం జవహర్ నవోదయ విద్యాలయం పరీక్షా కేంద్రాన్ని ఆర్‌ఏ మునిస్వామి సందర్శించారు. అక్కడున్న సౌకర్యాలు, ఏర్పాట్లను పర్యవేక్షించారు.

జాతరకు ఏర్పాట్లు పూర్తి

మామిడికుదురు, మే 2(ఆంధ్రజ్యోతి): బి.దొడ్డవరం గ్రామదేవతలు శ్రీ ముత్యాలమ్మతల్లి, గోగులమ్మతల్లి జాతరను ఈనెల5వ తేదీ సోమవారం ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లుచేశారు. జాతర పురస్కరించుకుని శుక్రవారం అమ్మవారి ఆలయాలను సర్వాంగ సుందరంగా వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. శనివారం అమ్మవార్లకు శాలివాహనుల ఆధ్వర్యంలో సేవ జరుగుతుందని, 5న మేళతాళాలతో వైభవంగా జాతర నిర్వహిస్తామని, 6వ తేదీ మంగళవారం భక్తులు అమ్మవార్లకు నైవేద్యాలు సమర్పిస్తారని, అలాగే అమ్మవార్లకు నైవేద్యాలు భక్తులు సమర్పిస్తారని, 7వ తేదీ బుధవారం తీర్థం నిర్వహిస్తారని కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు ఆయా కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆలయ కమిటీ సభ్యులు కోరుతున్నారు.

మలికిపురం వెలుగు సీసీ నాగరాజు మృతి



మలికిపురం, మే 2(ఆంధ్రజ్యోతి): అమరావతిలో ప్రధాని సభకు డ్వాక్రా మహిళలతో వెళ్లి తిరిగి వస్తుండగా మలికిపురం వెలుగు సీసీ నాగరాజు రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. పశ్చిమగోదావరి జిల్లా కైకరం వద్ద బస్సు ఆపి మూత్ర విసర్జన చేసేందుకు రోడ్డు దాటుతుండగా వాహనం ఢీకొట్టింది. తలకు బలమైన గాయం కావడంతో ఆసుపత్రికి తీసుకువెళ్లగా మృతిచెందినట్టు తెలిసింది. ఈయన స్వస్థలం కడప. ఆయన మృతి పట్ల మహిళా శక్తి సంఘాలు విచారం వ్యక్తం చేస్తున్నాయి.

కిశోర బాలికలు అవగాహనతో ఉండాలి

మలికిపురం, మే 2(ఆంధ్రజ్యోతి): కిశోర బాలికలు ఒకరినొకరు పరిచయం పెంచుకోవడం ద్వారా తమ లక్ష్యాలను చేరుకోవచ్చునని రాజోలు ఐసీడీఎస్ సీడీపీవో వైకేడీ రమాదేవి అన్నారు. లక్కవరంలో సర్పంచ్ కోట పుష్పకుమారి అధ్యక్షతన జరిగిన కిశోరి వికాసం వేసవి శిక్షణ తరగతుల్లో రమాదేవి మాట్లాడారు. ఈనెల 2నుంచి 10వరకు ప్రాజెక్టు పరిధిలోని అన్ని గ్రామాల్లో కిశోర బాలికలకు అవగాహన కల్పిస్తామన్నారు. బాల్య వివాహాలపై కలిగే దుష్పరిణామాలపై వివరించారు. సూపర్‌వైజర్లు ప్రసన్నరాణి, సరోజిని, హైమావతి, చంద్రకళ, ముస్సీసా పాల్గొన్నారు. శృంగవరప్పాడులో కిశోరి వికాసంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. బేటీ బచావో.. బేటీ పడావో, కౌమర బాలికల సాధికారిత వైపు పయనం గురించి సూపర్‌వైజర్ చంద్రకళ వివరించారు.అంగన్‌వాడీ వర్కర్లు సూర్యకుమారి, వరలక్ష్మి, జ్యోతి, శేషవేణి, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, తల్లుల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కిశోరి వికాసంపై వేసవి శిక్షణా తరగతులు

పి.గన్నవరం, మే 2(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అన్నిగ్రామాల్లో కిశోరి వికాసం-వేసవి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని సీడీపీవో వై.విజయశ్రీ తెలిపారు. ఈకార్యక్రమానికి ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీ వేశామన్నారు. శుక్రవారం ఆయాగ్రామాల సచివాలయాలు వద్ద అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. 11 నుంచి 18ఏళ్ల వరకు 20మంది బాలికలను గ్రూపుగా తయారుచేసి మంగళ, శుక్రవారాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో సర్పంచ్‌లు, టీమ్ సభ్యులు పాల్గొని కిశోరి బాలికలకు పలు అంశాలపై అవగాహన కల్పించి బ్రోచర్‌ను విడుదల చేశారు.

కిశోర బాలికలకు ప్రత్యేక అవగాహన

ఉప్పలగుప్తం, మే 2(ఆంధ్రజ్యోతి): చల్లపల్లి గ్రామంలోని 12 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని కిశోర బాలికలకు శుక్రవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై వివరించారు. గ్రామ సర్పంచ్ ఇసుకపట్ల జయమణీరఘుబాబు ఆధ్వర్యంలో గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, సంక్షేమ సహాయకులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

అంబాజీపేట, మే 2(ఆంధ్రజ్యోతి): కిసోర వికాసం వేసవి శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఎస్‌వీఎస్ మహాలక్ష్మి, వెర్నమ్మ అన్నారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అంబాజీపేటలో ప్రారంభించగా, పుల్లేటికుర్రులో సర్పంచ్ జల్లి బాలరాజు ప్రారంభించారు. పీహెచ్ఎన్ భూలక్ష్మి, హెచ్‌వీ శాంతకుమారి, ఉపసర్పంచ్ వీరా రవి, అంగన్‌వాడీ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఆడ పిల్లలు అన్ని రంగాల్లో రాణించాలి

అంతర్వేది, మే 2(ఆంధ్రజ్యోతి): అప్పనరామునిలంకలో కిశోరి వికాసం కార్యక్రమంలో గ్రామస్థాయి వేసవి శిబిరాలను శుక్రవారం నుంచి జూన్ 10 వరకు నిర్వహిస్తున్నట్టు ఐసీడీఎస్ సీడీపీవో వైకేడీ రమాదేవి తెలిపారు. ఈ శిక్షణ శిబిరాలను ఎంపీపీ వీరా మల్లిబాబు శుక్రవారం ప్రారంభించారు. కిశోర బాలికల పోషకాహారం, అక్రమ రవాణా గురించి బాలికలకు వివరించారు. అనంతరం ర్యాలీగా గ్రామంలో పర్యటించారు. ఆడపిల్లలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలని ఎంపీపీ వీరా మల్లిబాబు అన్నారు. సర్పంచ్ సుబ్బరాజు, సీహెచ్ పెద్దిరాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్కే మున్నీసా, జీఎంఎస్కేఎం కీర్తి, ఏఎన్ఎం, అంగన్‌వాడీలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మండపేట



ధాన్యం తడిసిపోకుండా ఒబ్బిడి చేస్తున్న రైతులు

అకాల వర్షంతో రైతుల్లో ఆందోళన

కె.గంగవరం, మే 2(ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం సాయంత్రం అకాల వర్షం కురవడంతో వరిసాగు చేసిన రైతులు ఇబ్బందులు పడ్డారు. ఇటీవల ఆయా ప్రాంతాల్లో వరి కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. రైతులు యంత్రాల ద్వారా కోసిన పంటను తేమశాతం తగ్గించుకునేందుకు ఆరబెడుతున్నారు. ఉదయం నుంచి ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో రైతులు ధాన్యాన్ని ఆరబెట్టారు. సాయంత్రం సమయంలో ఎండ కాస్తూనే వర్షం కురిసింది. దీంతో రైతులు పంటను రక్షించుకోవడానికి బరకాలతో కప్పుతూ తడవకుండా రక్షించుకునే ప్రయత్నం చేశారు. ఇటీవల వాతావరణంలో ఆకస్మికంగా వస్తున్న మార్పులతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.



వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

వాడపల్లి వెంకన్న ఆదాయం రూ.3.89 లక్షలు

ఆత్రేయపురం, మే 2(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీనెలకొంది. నోము ఆచరించిన భక్తజనం అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తులు అన్న ప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.3,89,216 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. అమలాపురానికి చెందిన కరాటం సూరిబాబు, భానుమణి దంపతులు 14.5 కిలోల ఇత్తడి దీపపు కుందులను ఆయన సిబ్బందికి అందజేయగా, దాతలను వారు అభినందిచారు.

భక్తులకు మెరుగైన సౌకర్యాలపై అధికారుల సమీక్ష

ఆత్రేయపురం, మే 2(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు అధికారుల బృందం శుక్రవారం సమీక్షించారు. సింహాచలం ఘటన నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వివిధ శాఖల అధికారులు వాడపల్లిలో అప్రమత్తమై భక్తులకు మరింత బాధ్యతగా చేపట్టాల్సిన సౌకర్యాలపై చర్చించారు. శుక్రవారం ఆలయంలో ఉపకమిషనరు సూర్యచక్రధరరావు, తహశీల్దారు టి.రాజేశ్వరరావు, ఎస్ఐ ఎస్.రాము, వైద్యాధికారి వి. సౌమ్య తదితర శాఖల ఆధ్వర్యంలో భక్తుల సౌకర్యాలపై చర్చించారు. ఎండవేడి ఎక్కువగా ఉండటం తో తిరువీధులు, అన్నప్రసాద ప్రసాదం వద్ద చలువ పందిర్లు వేశారు.



భక్తుల ఏర్పాట్లపై సమీక్షిస్తున్న అధికారుల బృందం

సలాదికి పలువురు ఘన నివాళి



సలాది విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

కొత్తపేట, మే 2(ఆంధ్రజ్యోతి): కాపు రిజర్వేషన్ పోరాట సమితి నాయకుడు దివంగత సలాది స్వామినాయుడు వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం పలుచోట్ల నివాళులర్పించారు. పాత బస్టాండ్ సెంటర్లో ఆయన విగ్రహానికి కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, సలాది తనయుడు సలాది రామకృష్ణ తదితరులు నివాళులర్పించారు. కార్యక్రమంలో కంఠంశెట్టి శ్రీనివాస్, పాలూరి సత్యానందం, బూసి జయలక్ష్మి, భాస్కరరావు, దర్నాల రామకృష్ణ, ముద్రగడ సుబ్బారావు, వి. సత్యనారాయణ, తమ్మన సాయిప్రసాద్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా సర్వారాయుడు జయంతి

కపిలేశ్వరపురం, మే 2 (ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరపురం హరికథ పాఠశాలలో శుక్రవారం దివంగత బలుసు బుచ్చి సర్వారాయుడు జయంతిని నిర్వహించారు. వేదపాఠశాల ప్రిన్సిపాల్ తంగిరాల దత్తాత్రేయశర్మ అధ్యక్షతన సర్వారాయ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ డాక్టర్ ఎస్‌బీపీపీ రామ్మోహన్ ప్రోత్సాహంతో జరిగిన కార్యక్రమంలో కమ్మ వీరవెంకట్రావు, గొర్తి రామచంద్రరావు, నేమాని నాగలక్ష్మి, భాగవతారిణి, ఎస్ఎస్‌వి చలపతిరావు, తదితరులు మాట్లాడారు. అనంతరం వేద పాఠశాల పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ వేద రక్షణ జరిగిందని, తమ జీవితాలు మంచి బాటలో నిలిచాయన్నారు. అనంతరం సభాధ్యక్షుడు దత్తాత్రేయశర్మ, పండితులు, పెద్దలు పలు అంశాలపై మాట్లాడారు. అనంతరం హరికథా పాఠశాల విద్యార్థినులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. హరికథా గానం చేశారు. కార్యక్రమంలో హరికథా పాఠశాల ప్రిన్సిపాల్ ఎ.సింగరాచార్యులు, హరికథ వేద పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న వేద పాఠశాల ప్రిన్సిపాల్ దత్తాత్రేయశర్మ

నివాస గృహాలను కూల్చడం సరికాదు

కపిలేశ్వరపురం, మే 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్లూరు చెరువు గట్టుపై నాలుగు దశాబ్ధాలుగా నివసిస్తున్న బీసీ సామాజిక వర్గానికి చెందిన 23 గృహాలను ఇటీవల కూల్చివేయడాన్ని బీసీ ప్రజా సంక్షేమ సంఘం ఖండించింది. శుక్రవారం వల్లూరులో సంఘం జాతీయ అధ్యక్షుడు గూడూరు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గృహాలు తొలగించిన వారికి ప్రత్యామ్నాయం చూపించకపోవడం దారుణమన్నారు. చెరువుచుట్టూ ఆక్రమణలను కూడా తొలగిస్తామని నోటీసులు జారీ చేయడం విచారకరమన్నారు. ఇటీవల మాచర గ్రామంలో చెరువుగట్టు వద్ద ఓసీ సామాజిక వర్గానికి చెందిన కల్యాణ మండపానికి స్థానిక ఎమ్మెల్యే శంకుస్థాపన చేసిన విషయాన్ని వారు ప్రస్తావించారు. అక్కడొక న్యాయమా, ఇక్కడొక న్యాయమా అని వారు విమర్శించారు. ఈ ఘటనపై ప్రభుత్వం సానుకూల చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో బీసీ నాయకులు భాస్కరరావుతో పాటు అనేక మంది బీసీ నాయకులు పాల్గొన్నారు.

సికిల్‌సెల్ వ్యాధి నిర్ధారణకు ప్రత్యేక శిబిరాలు

అలమూరు, మే 3(ఆంధ్రజ్యోతి): గిరిజన తెగల్లో అధికంగా ఉండే సికిల్‌సెల్ వ్యాధి నిర్ధారణకు మండలంలో శుక్రవారం ప్రత్యేక శిబిరాలను ప్రారంభించారు. మండలంలోని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీ పరిధిలో వారికి రక్తపరీక్షలు నిర్వహించారు. రక్తహీనతతో శరీరం పాలిపోయినట్టు ఉండటం, దీర్ఘకాలం కామెర్లు, పలు అవయవాలు వాపుతో వంపులు తిరగడం వంటి లక్షణాలతో ఉన్న వారికి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎ.రాజు, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారి కిషోర్ తెలిపారు. చొప్పెల్ల పీహెచ్‌సీ పరిధిలో 252 మంది, పెదపళ్ల పీహెచ్‌సీ పరిధిలో 559 మందికి పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ రాజా అక్కుల, సీహెచ్‌వో ఎంఎస్ఎన్ రెడ్డి, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.



సికిల్‌సెల్ వ్యాధి పరీక్షల కార్డులను ఆవిష్కరిస్తున్న వైద్యులు, అధికారులు

ఘనంగా ఆదిశంకరాచార్యులు జయంతి

ద్రాక్షారామ, మే 2(ఆంధ్రజ్యోతి): జగద్గురు ఆది శంకరాచార్యులు జయంతిని శుక్రవారం ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో నిర్వహించారు. నంది మండపంలో ఆదిశంకరాచార్యులకు పూజలు చేశారు. అనంతరం ఆదిశంకరాచార్యులు విగ్రహంతో గ్రామోత్సవం జరిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.



కె.గంగవరం మండలం పామర్రు నుంచి ప్రధాని సభకు బయలుదేరిన కూటమి నాయకులు



రాయవరం నుంచి ప్రధాని మోదీ సభను పురస్కరించుకుని అమరావతికి తరలి వెళుతున్న ప్రజలు



దేశ ప్రధాని మోదీ అమరావతి సభకు మండపేట నుంచి తరలివెళుతున్న కూటమి నేతలు

ప్రధాని సభకు తరలిన జనం

ఆయా మండలాల నుంచి బస్సులు, కార్లలో తరలిన కూటమి నాయకులు, కార్యకర్తలు

కె.గంగవరం, మే 2(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి పునర్నిర్మాణ కార్యక్రమానికి శుక్రవారం హాజరవుతున్న దేశ ప్రధాని మోదీ సభకు మండలం నుంచి కూటమి నాయకులు భారీగా తరలివెళ్లారు. మండలం నుంచి మూడు బస్సులలో నాయకులు, డ్వాక్రా యానిమేటర్‌లు, డ్వాక్రా సభ్యులు, కూటమి నాయకులు ప్రధాని సభకు బయలుదేరారు. పామర్రులో ఎంపీడీవో ఎన్.శ్రీనివాసరావు, కూటమి నాయకులు మరివాడ సూరిబాబు, మరివాడ చిన్నికృష్ణ, మేడిశెట్టి రవికుమార్, సలాది రమేష్‌ల పర్యవేక్షణలో బస్సుల్లో తరలివెళ్లారు.

ఆలమూరువాసుల పయనం

ఆలమూరు, (ఆంధ్రజ్యోతి): మండలం నుంచి అమరావతిలో జరిగే ప్రధాని సభకు అధిక సంఖ్యలో స్థానికులు బయలుదేరి వెళ్లారు. ఆలమూరు మండలం నుంచి వెళ్లిన బస్సులను ఎంపీడీవో ఎ.రాజు, ఆలమూరు డీసీ అధ్యక్షుడు మెర్ల గోపాలస్వామి ప్రారంభించారు. మోదీ సభకు వెళ్లే వారికి బస్సుల్లో భద్రతగా పంచాయతీ కార్యదర్శులు, మహిళా పోలీసులు, ఆరోగ్య సిబ్బందిని నియమించినట్టు ఎంపీడీవో తెలిపారు.

మండపేట, (ఆంధ్రజ్యోతి): అమరావతి సభలో పాల్గొనేందుకు నియోజకవర్గం నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమినేతలు శుక్రవారం అధిక సంఖ్యలో తరలివెళ్లారు. నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో బస్సుల్లో వారు బయలుదేరి వెళ్లారు. మండపేటలో బస్సులను టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఉంగరాల రాంబాబు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొనా సత్యనారాయణ, మాదిగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మందపల్లి దొరబాబు తదితరులు అమరావతికి బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆలమూరు నుంచి అమరావతి సభకు బస్సును ప్రారంభిస్తున్న దృశ్యం

రాయవరం, (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి సభకు మండలంలోని ఆయా గ్రామాల నుంచి అధిక సంఖ్యలో కూటమి నాయకులు, ప్రజలు, మహిళా సమాఖ్యల సభ్యులు తరలి వెళ్లారు. రాష్ట్రాభివృద్ధికి కేంద్రం సహాయ, సహకారాలు అందిస్తున్నందుకు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ప్రధాని మోదీ సభకు ఉత్సాహంగా అమరావతి తరలివెళ్లారు.

రాజధానికి కొత్తపేట నేతలు పయనం

కొత్తపేట, (ఆంధ్రజ్యోతి): కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆదేశాల మేరకు రాజధాని అమరావతి అభివృద్ధి పనుల పునఃప్రారంభ కార్యక్రమానికి పెద్దఎత్తున నేతలు, అధికారులు తరలివెళ్లారు. కొత్తపేట నియోజకవర్గం నుంచి సుమారు 10 బస్సులు, 40 కార్లలో ఆనందోత్సవాల మధ్య వారంతా తరలివెళ్లారు.

అమరావతికి తరలివెళ్లిన టీడీపీ శ్రేణులు

రావులపాలెం, (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో అభివృద్ధి పనులను పునఃప్రారంభించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం శంకుస్థాపన చేసే కార్యక్రమానికి రావులపాలెం నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున కార్లు, బస్సుల్లో తరలివెళ్లారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు ఆదేశాల మేరకు ఉదయం నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్దఎత్తున అమరావతి తరలివెళ్లారు. ఆయా ఏర్పాట్లను పార్టీశ్రేణులు పర్యవేక్షించారు.



రావులపాలెంలో రాజధాని అమరావతికి తరలివెళుతున్న టీడీపీ శ్రేణులు

పేకాట శిబిరంపై పోలీసుల దాడులు

ఆత్రేయపురం, మే 2(ఆంధ్రజ్యోతి): నార్కెడిమిల్లిపాలెంలో పేకాట శిబిరంపై పోలీసులు దాడులు జరిపారు. శుక్రవారం ఎస్ఐ ఎస్.రాము ఆధ్వర్యంలో పేకాడుతున్న శిబిరంపై దాడులు చేశారు. ఈ దాడిలో ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.22,500 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వైఎస్ షర్మిలను గృహ నిర్బంధం చేయడం విచారకరం

రావులపాలెం, మే 2(ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని ప్రాంతంలో పర్యటన చేసేందుకు వెళుతున్న పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను గృహనిర్బంధం చేయడం దారుణమని కాంగ్రెస్ పార్టీ కొత్తపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ రౌతు ఈశ్వరరావు అన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఎక్కడికైనా వెళ్లే హక్కు దేశ పౌరులకు ఉందన్నారు. పోలీసుల తీరును విచారకరమని తెలిపారు.

నేడు అభివృద్ధి పనులకు శ్రీకారం

రాయవరం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రాయవరం గ్రామంలో పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు నేడు ప్రారంభిస్తారని ఎంపీడీవో ఎన్. కీర్తి స్పందన తెలిపారు. శుక్రవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో భాగంగా రాయవరంలో కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభిస్తారన్నారు. వీటితో పాటు రాయవరంలో నిర్మించిన రెండు సీసీ రోడ్లను ప్రారంభిస్తారన్నారు. రాయవరంలో జరిగే ఎమ్మెల్యే పర్యటనను కూటమి నాయకులు విజయవంతం చేయాలని టీడీపీ నాయకుడు ఉండవిల్లి రాంబాబు పిలుపునిచ్చారు.




మాట్లాడుతున్న వాసంశెట్టి సత్యం

కౌమార బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలి

రామచంద్రపురం(ద్రాక్షారామ), మే 2 (ఆంధ్రజ్యోతి): కౌమార బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో వరహాలక్ష్మి అన్నారు. శుక్రవారం రామచంద్రపురం ఐసీడీఎస్ పరిధిలో కిశోరి వికాసం 2 కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ కిషోరబాలికలు రక్తహీనత లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ బాల్యవివాహాలను పూర్తిస్థాయిలో అరికట్టాలన్నారు. నేటి నుంచి నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాల ద్వారా జ్ఞానసముపార్జన చేయాలన్నారు. సమావేశంలో వీఆర్‌వో బాపూజీ, కార్యదర్శి నాగూర్ అంగన్‌వాడీ సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఏపీ ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్



ఆలమూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పెదపళ్ల గ్రామానికి చెందిన గారపాటి శ్రీనివాసరావు నియమితులయ్యారు. చింతలూరు సాగునీటి సంఘం అధ్యక్షుడిగా పనిచేస్తూ రైతులకు పలు సేవలందిస్తున్న నేపథ్యంలో ఆయన సేవలను గుర్తించి నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఏపీలో లేబర్ అండ్ చైల్డ్ విభాగంలో ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ ఢిల్లీ నుంచి ఉత్తర్వులు అందాయి. ఈ సందర్భంగా పలువురు ఆయన్ను అభినందించారు.



తాడిపూడిలో ఎమ్మెల్యే బండారు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న రైతులు

ధాన్యం కొనుగోళ్లకు అనుమతి

ఎమ్మెల్యే బండారు చిత్రపటానికి రైతులు పాలాభిషేకం

ఆత్రేయపురం, మే 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ లక్ష్యం మేరకు ధాన్యం కొనుగోళ్లు చేపట్టి రైతుల ఖాతాలో సొమ్ము జమ చేశారు. కాగా దిగుబడి పెరగడంతో మరింత ధాన్యం కొనుగోళ్లు చేయాలంటూ రైతులు ఇటీవల ఎమ్మెల్యే ఎదుట మొరపెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో నత్తనడకగా ధాన్యం కొనుగోళ్లు అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం వెలువడింది. ముందుగానే కొత్తపేట ఎమ్మెల్యే బండారు, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అచ్చెన్నాయుడు ధాన్యం కొనుగోళ్లపై చర్చించారు. పౌరసరఫరాలశాఖ ఎండీని కూడా తక్షణమే కొనుగోళ్లు చేపట్టాలని కోరారు. ఎమ్మెల్యే కృషితో ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. శుక్రవారం జిల్లా జాయింట్ కలెక్టర్ నిషాంతి ఆత్రేయపురం మండలంలో 4950 మెట్రిక్ టన్నులు, ఆలమూరు మండలంలో 2680 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు చేసేందుకు అనుమతులు మంజూరు చేశారు. కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని ఎగుమతులు చేయడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. తాడిపూడిలో ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు ఎం.వెంకట్రాజు, పార్టీ గ్రామ అధ్యక్షుడు కె.రామకృష్ణంరాజు ఆధ్వర్యంలో పలువురు రైతులు పాలాభిషేకం జరిపి హర్షం వ్యక్తం చేశారు.

ఆక్రమణ ఫిర్యాదుపై అధికారుల సర్వే



మాట్లాడుతున్న తహశీల్దార్ చిన్నారావు

కపిలేశ్వరపురం, మే 2 (ఆంధ్రజ్యోతి): వెదురుమూడి గ్రామంలో ఆక్రమణ ఫిర్యాదుపై అధికారులు శుక్రవారం సర్వే జరిపారు. వెదురుమూడి గ్రామంలోని మసీదు స్థలంలో ఉప్పర్ల శేఖర్ అక్రమంగా గోడ నిర్మించాడని, దాన్ని తొలగించాలంటూ షేక్ హైదర్ గతనెల 21న పీజీఆర్ఎస్‌లో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై తహసీల్దార్ చిన్నారావు, ఈవోపీఆర్డీ మోహన్, గ్రామ కార్యదర్శి శారద, సర్వేయర్లు మసీదు స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. వారిద్దరి దస్తావేజులను పరిశీలించి సర్వే జరిపారు. దీనిపై తహసీల్దార్ మాట్లాడుతూ కలెక్టర్‌కు అందిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టామని వారిద్దరి డాక్యుమెంట్లు పరిశీలించి వాటి ఆధారంగా సర్వే నిర్వహించామన్నారు.

వైద్య ఆరోగ్య సిబ్బందికి శిక్షణ

రాయవరం, మే 2(ఆంధ్రజ్యోతి): మాచవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య ఆరోగ్య సిబ్బందికి శుక్రవారం యూవిన్ ఓవర్ డ్యూస్‌పై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయం వ్యాక్సినేషన్ మేనేజర్ సునీల్ పాల్గొని పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ మణికంఠ, పీహెచ్ఈవో తులసీదాస్, సూపర్‌వైజర్ గోపాలకృష్ణ, రాయవరం, మాచవరం పీహెచ్‌సీల సిబ్బంది తదతరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

రాయవరం, మే 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని పసలపూడి, నదురుబాద గ్రామాల్లో జరుగుతున్న పనులను శుక్రవారం డ్వామా రామచంద్రపురం క్లస్టర్ సహాయ సంచాలకుడు ఐ.స్వరూప్ పరిశీలించారు. రెండు గ్రామాల్లో ఉపాధి హామీ పనులు జరుగుతున్న తీరు, కూలీలకు వేతనాలు ఏవిధంగా అందజేస్తున్నారు అంశాన్ని పరిశీలించడంతో పాటు పనులు కల్పిస్తున్న తీరుపైన కూలీలతో మాట్లాడారు. అనంతరం రాయవరం ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఏపీడీని ఏపీవో సుధారాణి, జేఈ కనకలత, సిబ్బంది శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కిశోర్ బాలికా వికాసం శిక్షణ తరగతులు

ఆలమూరు, మే 2(ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ ప్రాజెక్టు అధ్వర్యంలో అమలు జరుగుతున్న కిషోర్ బాలికా వికాసం2 శిక్షణ తరగతులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఆలమూరు గ్రామ సచివాలయం వద్ద ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎన్.నాగలక్ష్మి అధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ కిషోర్ బాలికా వికాసం శిక్షణ తరగతులను సద్వియోగం చేసుకోవాలని సూచించారు. ఈనెల 2నుంచి జూన్ 10 వరకు మండలంలో ఆయా సచివాలయాల వద్ద ఈ తరగతులు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నాతి లావణ్యకుమార్‌రాజా, టీడీపీ నాయకులు ఈదల సత్తిబాబు, వంటిపల్లి సతీష్‌కుమార్, రామానుజుల శేషగిరిరావు, సలాది నాగేశ్వరరావు, ఈదల నల్లబాబు పాల్గొని కరపత్రాలను ఆవిష్కరించారు.

రాహుల్ వల్లే దేశంలో కులగణన

కాంగ్రెస్ పార్టీ కిసాన్‌సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కామన



మండపేట, మే 2 (ఆంధ్రజ్యోతి): దేశంలో కులగణన కాంగ్రెస్ యువనేత రాహుల్ వల్లే జరుగుతున్నదని కాంగ్రెస్ పార్టీ కిసాన్‌సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కామన ప్రభాకర రావు అన్నారు. పార్లమెంట్‌లో రాహుల్ గాంధీ పోరాటం వల్లే తెలంగాణ, కర్ణాటకల్లో కులగణన జరిగిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. మిగిలిన రాష్ట్రాల్లో కూడా కులగణన జరిపేందుకు కేంద్రం దిగి వచ్చింద న్నారు. ఈ ఏడాది చివరికల్లా జనాభా లెక్కలతోపాటు, కులగణన చేసేందుకు ముందుకు వచ్చిందన్నారు. దేశంలో కులాల వారీగా ఎంతమేర ఉన్నారో వెల్లడవుతుందని ఆయన అన్నారు. ప్రజల సంక్షేమం కోసం పనిచేసే పార్టీ కాంగ్రెస్ అని ఆయన అన్నారు.